www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 90 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com శుక్రవారం 17 - 07 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



9 నెలల్లో కొత్త లుక్.. నాచారం చెరువు సుందరీకరణ షురూ

## ఈనెల 22న

# ‘తల్లికి వందనం’

- ‘తల్లికి వందనం’ లబ్ధిదారులకు గుడ్‌న్యూస్
- ఈనెల 22న నిధులు విడుదల
- తల్లికి వందనం నిధుల విడుదలపై ప్రభుత్వం కీలక అప్డేట్
- ఈ పథకానికి రూ.10,120.78 కోట్ల చెల్లింపునకు విద్యాశాఖ అనుమతి
- తద్వారా 67,47,190 మంది విద్యార్థులకు లబ్ధి




**అమరావతి :** తల్లికి వందనం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఈనెల 22న తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు తెలిపింది. ఈ పథకం కింద ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాకు రూ. 13,000లు, పాఠశాల అభివృద్ధికి రూ.2000ల చొప్పున మొత్తం రూ.15,000ల నగదును నేరుగా జమ చేస్తోంది. ఈ మేరకు ఈ పథకాన్ని 2026-2027 విద్యాసంవత్సరానికి వర్తింపజేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఇందుకోసం రూ.10,120.78 కోట్ల చెల్లింపునకు విద్యాశాఖ అనుమతినిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులిచ్చారు. తద్వారా 67,47,190 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఈనెల 22 నాటికి 64,76,590 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమకానుంది. అదే రోజున స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో అర్హుల జాబితా ప్రకటిస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఆగస్ట్ 3 వరకు స్వీకరిస్తారు. ఆ తర్వాత సప్లిమెంటరీ జాబితాను ఆగస్ట్ 10 నాటికి విడుదల చేస్తారు. కొత్తగా అడ్మిషన్లు తీసుకున్న ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి, ఇంటర్ - మిగతా 2 లో

### పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన

## గవర్నర్ అబ్దుల్ నజీర్



- లైబ్రరీపై ప్రత్యేక ఆసక్తి
- ఇటీవల పవన్ కల్యాణ్ కు శస్త్రచికిత్స
- హైదరాబాదులో పవన్ నివాసానికి వెళ్లిన ఏపీ గవర్నర్
- ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వైనం
- పవన్ ఇంటిలోని గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలపై చర్చ
- త్వరగా కోలుకుని విధుల్లో చేరాలని ఆకాంక్ష
- గవర్నర్ రాక పట్ల కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గురువారం పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్, ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి - మిగతా 2 లో

## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి



- ‘వీజీఎఫ్ విప్లవం’పై సీఎం చంద్రబాబు దృష్టి
- భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం ఖాయమన్న సీఎం చంద్రబాబు
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమని వెల్లడి
- త్వరలో ‘పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0’కు రూపకల్పన
- పీపీపీ కింద రూ.1.23 లక్షల కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు
- నిరర్ధక ప్రభుత్వ ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని ఆదేశం

**అమరావతి :** రాష్ట్రంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానమే కీలకమని, భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కూడిన ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులు తేనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. - మిగతా 2 లో

## పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట



- ఇద్దరు మృతి , అనేక మందికి గాయాలు
- మరీచకోట్‌కు చేరువలో ఘటన
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- భగవంతుని దర్శనం కోసం పూరీకి చేరుకున్న 2 లక్షల మంది భక్తులు
- భక్తులను ఆకట్టుకుంటోన్న జగన్నాథుని సైకత శిల్పం

**ఒడిశా :** ఒడిశాలో గురువారం ప్రారంభమైన జగన్నాథుని రథయాత్రలో అపశ్రుతి జరిగింది. యాత్ర ప్రారంభమైన కొద్దిసేపటికే తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. అయితే, మృతులకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో గందరగోళ పరిస్థితి నెలకొందని, ఈ నేపథ్యంలో గ్రాండ్ రోడ్ వద్ద ఈ ప్రమాదం - మిగతా 2 లో

## ప్రియాంక గాంధీ పేరుతో మోసం

- కేరళలో మంత్రి పదవులకు బేరం!
- ప్రియాంక గాంధీ కార్యాలయం పేరుతో కేరళ కాంగ్రెస్ నేతలకు మోసపూరిత ఫోన్లు
- మంత్రి పదవులు ఇప్పిస్తామంటూ కోట్ల రూపాయల డిమాండ్
- ఎలత్తూర్ ఎమ్మెల్యే విద్యా బాలకృష్ణన్‌కు రూ.3 కోట్లు ఇవ్వాలంటూ ఆఫర్
- ప్రియాంక పీఎస్ ఫిర్యాదుతో సైబర్ పోలీసుల దర్యాప్తు ప్రారంభం



**ఢిల్లీ :** కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ సైబర్ నేరగాళ్లు కేరళ కాంగ్రెస్ నాయకులను మోసం చేసేందుకు యత్నించారు. రాష్ట్రంలో మంత్రి పదవులు ఇప్పిస్తామని నమ్మబలికి, వారి నుంచి కోట్ల రూపాయలు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఫిర్యాదులు అందడంతో పోలీసులు సైబర్ మోసం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మోసం ఎలత్తూర్ ఎమ్మెల్యే విద్యా బాలకృష్ణన్‌కు జులై 6న వచ్చిన ఒక వాట్సాప్ కాల్‌తో వెలుగులోకి వచ్చింది. ప్రియాంక గాంధీ - మిగతా 2 లో




### న్యూజిలాండ్‌లో భూకంపం

## సునామీ హెచ్చరిక జారీ

- న్యూజిలాండ్ దక్షిణ దీవిని వణికించిన భూకంపం
- రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదైన తీవ్రత
- పశ్చిమ తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ

## 6 నగరాల్లో ఇంటి ఓనర్ల వద్దే నిలిచిపోయిన రూ.1.26 లక్షల కోట్ల డిపాజిట్లు

- ముంబైలో అత్యధికంగా రూ.41,156 కోట్లు, బెంగళూరులో రూ.31,628 కోట్లు
- ఆదాయంలో 30 శాతానికి పైగా అద్దెకే చెల్లిస్తున్న నగరవాసులు
- డిపాజిట్ తిరిగి పొందడంలో ఢిల్లీలో 12 శాతం మందికి తీవ్ర వివాదాలు




**హైదరాబాద్ :** దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో అద్దెదారులు చెల్లించిన సెక్యూరిటీ డిపాజిట్లు ఏకంగా రూ.1.26 లక్షల కోట్లకు పైగా గృహ యజమానుల వద్ద నిలిచిపోయాయని తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. హైదరాబాద్, ముంబై, బెంగళూరు, ఢిల్లీ-ఎన్సీఆర్, చెన్నై, పుణె నగరాల్లో ఈ పరిస్థితి నెలకొన్నట్లు ‘నోబ్రోకర్ రెంట్ రిపోర్ట్ 2026’ స్పష్టం చేసింది. నిరంతరం పెరుగుతున్న ఇంటి అద్దెలు, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో ఈ డిపాజిట్ల భారం అద్దెదారులకు పెను సవాలుగా మారుతోంది. ఈ నివేదిక ప్రకారం, ముంబై - మిగతా 2 లో

### గోల్కొండలో

## ఘనంగా ఆషాఢ బోనాలు



- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు

**హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే - మిగతా 2 లో

## గ్రీన్‌వ్యాలీగా మారనున్న ఓయూ



- వెయ్యి కోట్లతో సిద్ధమవుతున్న డీపీఆర్
- కొత్త రూపును సంతరించుకోనున్న ఉస్మానియా వర్సిటీ
- త్వరలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న అధికారులు
- వర్సిటీ అభివృద్ధి పనులకు ఇప్పటికే రూ.1000 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ చరిత్రలో అంతర్భాగం. ఎన్నో లక్షల మంది విద్యార్థులకు చదువు చెప్పడంతో పాటు - మిగతా 2 లో

## కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు

- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఆదరించలేదని బీఆర్ఎస్ కక్షగట్టిందన్న పొంగులేటి
- సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపాటు
- అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని ఆగ్రహం



**హైదరాబాద్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఈరోజు ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని - మిగతా 2 లో

# సంపాదకీయం

## విహారంలో విషాదం

వియత్నాం బోటు ప్రమాదంలో మరణించిన భారతీయుల మృతదేహాలు స్వస్థలాలకు చేరుకున్నాయి. దక్షిణ భారతం నుంచి ఆ దేశానికి విహారయాత్రకు వెళ్ళి స్పీడ్‌బోటు తిరగబడిన ఈ దుర్ఘటనలో ముగ్గురు తెలుగువారు సహా పదిహేనుమంది మృత్యువాత పడటం అత్యంత విషాదకరం. సంక్రాంతి సీజన్‌లో అమ్మకాలు బాగా జరిపిన డీలర్లు, వారి కుటుంబ సభ్యులకు ఒక మొబైల్ కంపెనీ ఈ టూర్ ఏర్పాటు చేసిందట. మూడు పడవల్లో 108 మంది పెరల్ ఐలాండ్ వెళ్ళి, తిరిగి ఒడ్డుకు ప్రయాణం కట్టినప్పుడు, ముప్పైరెండు మంది భారతీయులు, ముగ్గురు స్థానిక సిబ్బందితో ఉన్న తొలి స్పీడ్‌బోటు బయలుదేరిన రెండు నిముషాల్లో, అరకిలోమీటరు కూడా వెళ్ళకుండానే తిరగబడింది. దూకేసిన ఇరవైమంది ప్రాణాలు కాపాడుకోగలిగితే, బోటుకింద ఇరుక్కున్నవారు ఆ ఉప్పునీళ్ళలో మునకలు వేస్తూ ఊపిరాడక కన్నుమూశారు. మృతుల కుటుంబాల్లో ఇది తీరని విషాదం నింపితే, అప్పటివరకూ తమతో కలసి సరదాగా గడిపిన కొందరు కళ్ళెదుటే ఆర్తనాదాలు చేస్తూ చనిపోవడం మిగతావారిని దిగ్భ్రాంతిలో ముంచింది. వియత్నాం ప్రభుత్వం అత్యున్నత విచారణకు ఆదేశించినప్పటికీ, ఇటీవలి కాలంలో పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్న ఆ దేశానికి ఈ ఘటన ఓ మాయనిమచ్చ. ఈ ఘోరానికి కారణం ప్రకృతి వైపరీత్యమా, మానవ నిర్లక్ష్యమా? అన్న చర్చ విస్తృతంగా సాగుతోంది. ప్రమాదంలో బయటపడినవారు ఆప్తులను కోల్పోయిన బాధను పంచుకుంటూనే, ఆ ఘోరం జరిగిన తీరు తెన్నులను వివరిస్తున్నారు. అల్లకల్లోలంగా ఉన్న సముద్రం, విపరీతమైన గాలి? తోడై ఈ బోటు నియంత్రణకు వీలుగానంతగా ఊగిపోయిందని చెబుతున్నారు. కఠినమైన వాతావరణంలో ఈ స్పీడ్‌బోట్ హఠాత్తుగా మలుపు తిరగడంతో ఎడమవైపు ఒరిగిందని, ఆందోళనలో ఉన్న పర్యాటకుల్లో అధికులు అటుగా పడిపోయారని అంటారు. మొత్తంగా, స్వల్పకాలంలో అత్యధిక బరువు ఒకవైపున పెరిగిపోవడంతో పడవ పూర్తిగా అదుపుతప్పి 80శాతానికి పైగా ఒరిగిపోయింది. కెప్టెన్, గైడ్ తమ ముందున్న మార్గం గుండా తప్పించుకున్నారు, లోపలున్నవారిలో కొందరు ధైర్యం చేసి బయటకు దూకేశారు. కానీ, పడవ దిగువున చిక్కుబడినవారిలో అనేకులు బలికావలసి వచ్చింది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, నిబంధనల ఉల్లంఘనలు, సహాయక చర్యల్లో జాప్యం ఇత్యాది విషయాలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. సహాయం తక్షణమే అందలేదన్న విమర్శలను అక్కడి ప్రభుత్వం ఖండిస్తోంది కానీ, ప్రాథమిక చికిత్స వెంటనే దక్కివుంటే అనేకమంది బతికేవారని తోటివారు అంటున్నారు. బాధితులను ఒడ్డుకు చేర్చిన తరువాత కూడా స్థానికులే ఎంతోకొంత సాయం చేశారని, అయితే, అక్కడి ఆస్పత్రిలో సిబ్బంది కొరతవల్ల ఆక్సిజన్ వంటివి దక్కలేదనీ, ముఖ్యంగా గాయపడినవారికి గంటలపాటు ఏ చికిత్సా అందలేదన్నది విమర్శ. పర్యాటకుల భద్రత విషయంలో రాజీపడిన పక్షంలో విహారయాత్రలు విషాదాంతాలవుతాయనడానికి ఫూ క్వాక్ ద్వీపంలో జరిగిన ఈ ఘోరప్రమాదం నిదర్శనం. స్పీడ్‌బోటును ఎక్కువమందితో నింపేశారన్న విమర్శలూ లేకపోలేదు. దీనికితోడు, పర్యాటకులందరికీ సరిపడా లైఫ్‌జాకెట్లు బోట్లో ఉన్నప్పటికీ, ప్రయాణం ఆరంభానికి ముందు వాటిని అందరూ ధరించేట్టుగా చేయడంలో స్థానిక సిబ్బంది చొరవతీసుకోలేదని అంటారు. అతివేగంగా ప్రయాణించే స్పీడ్‌బోట్ మీద లోపలున్నవారి బరువులో వచ్చే చిన్నపాటి మార్పుచేర్పులు కూడా తీవ్రప్రభావం చూపుతాయి కనుక, బోట్ ఎంత ఊగినా ఎవరూ తమ సీట్లనుంచి కదలకుండా ఉండేట్టుగా జాగ్రత్తలు తీసుకొనివుంటే బాగుండేది. యాత్రని స్పాన్సర్ చేసిన కంపెనీ, టూర్ ఆపరేటర్, స్థానిక సిబ్బంది, పర్యాటకులు కలసికట్టుగా వ్యవహరించి, ఏ దశలోనూ నిబంధనల ఉల్లంఘనకు తావులేకుండా, భద్రతా ప్రమాణాలకు కట్టుబడినప్పుడే ఇటువంటి విషాదాలు జరగకుండా ఉంటాయి. పర్యాటకులు కూడా తమ రక్షణ బాధ్యతను పూర్తిగా ఎదుటివారిపైన వదిలేయకుండా, తాము క్షేమంగా ఇంటికి చేరడం కోసం ప్రతీ నిర్లక్ష్యాన్నీ ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ఆకర్షణీయమైన పర్యాటక క్షేత్రంగా వేగంగా ఎదుగుతూ, భారతీయులను విశేషంగా ఆకర్షిస్తున్న వియత్నాం ఈ ఘటనమీద నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపించి, బాధ్యులను శిక్షించి, పర్యాటకుల ప్రాణరక్షణ విధానాలమీద మరింత శ్రద్ధపెట్టాలి.



# పీపీపీతోనే వేగంగా అభివృద్ధి



**మొదటిపేజీ తరువాయి -** పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలోనే 'ఆంధ్రప్రదేశ్ పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'ను కేబినెట్ ముందుకు తీసుకురావాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పర్యాటకం సహా వివిధ రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో పురోగతిలో ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. పీపీపీ కింద చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణ విధానాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని, ఈ ప్రాజెక్టులకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని తెలిపారు. అలాగే, విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు కేంద్రం రూ.178 కోట్ల వీజీఎఫ్ అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రతీ ప్రాజెక్టును ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టులలో స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేసి వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని బస్టాండ్ల వద్ద ఉన్న భూములను వాణిజ్యపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఫైనాన్షియల్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. బలహీన వర్గాల విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు, రెసిడెన్షియల్ హాస్టళ్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట

**మొదటిపేజీ తరువాయి -** జరిగినట్లు తెలుస్తోంది. తొక్కిసలాట జరిగిన సమయంలో దాదాపు 120 మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడినట్లు ప్రాథమిక సమాచారం. ప్రత్యేక సహాయ యూనిట్-ల=ఖ బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అస్వస్థతకు గురైన భక్తులను చికిత్స నిమిత్తం పూరీ మెడికల్ ఆసుపత్రికి తరలించాయి. పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని ఉత్సవానికి హాజరవుతున్న యాత్రికుల భద్రతను పర్యవేక్షించేందుకు అత్యవసర ప్రతిస్పందన చర్యలను ముమ్మరం చేశామని అధికారులు వెల్లడించారు. మరోవైపు, పూరీలో వార్షిక రథ యాత్రను రాజు దివ్యసింగ్ దేవ్ 'ఛేరా పహన్‌రా' కార్యక్రమాన్ని నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం వెండి పల్లకిలో ఆలయానికి చేరుకున్న రాజు రథాలపై ఆసీనులైన దేవుళ్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పూజారులు మంత్రోచ్చారణ చేస్తుండగా ఆయన జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్ర రథాలపై బంగారు చీపురుతో ఊడ్చే క్రతువును నిర్వహించారు. శ్రీక్షేత్ర గోవర్ధన పీఠానికి చెందిన జగద్గురు శంకరాచార్యులు దివ్య రథాలపై ఉన్న దేవతామూర్తులను దర్శించుకున్నారు. అనంతరం లక్షలాది భక్తుల జయజయ ధ్వానాల నడుమ రథయాత్ర సాగింది. స్వామివారి రథం లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. లక్షలాదిగా వచ్చిన భక్తులతో పూరీ గ్రాండ్ రోడ్డు పూర్తిగా నిండిపోయింది. ఓ వైపు జోరుగా వర్షం కురుస్తున్న దాన్ని లెక్కచెయకుండా, భగవంతుని దర్శనం కోసం దాదాపు 2లక్షల మంది భక్తులు పూరీకి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఒడిస్సీతోపాటు వివిధ కళాకారులు చేస్తున్న సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి. బుధవారం పూరీలో ఏకంగా 143 మిల్లీ మీటర్లకు పైగా వర్షం కురిసింది. గురువారం ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయిప్పటికీ ఉత్సవాలకు ఆటంకం కలగకుండా, రథాలు సాగే రహదారిలో నీరు నిలవకుండా చర్యలు చేపట్టారు. పూరీ గజపతి మహారాజు దివ్యసింగ్ దేవ్ సంప్రదాయబద్ధంగా బంగారు చీపురుతో రథాలను శుభ్రం చేసిన అనంతరం సాయంత్రం 4గంటలకు భక్తులు రథాల్ని లాగడం ప్రారంభించారు. రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి రథాలు చేరుకుంటాయి. పోలీసులతో పాటు కేంద్ర బలగాలు, నావికాదళం, తీర గస్తీ దళాలకు చెందిన 13 వేల మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, పూరీ జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా ప్రముఖ సైకత శిల్పి, పద్మశ్రీ అవార్డు గ్రహీత సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన జగన్నాథుని సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. ఈయన ఒడిశాలోని పూరీ తీరంలో జగన్నాథుడి రూపాన్ని అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన శిల్పం చుట్టూ ఇసుకతో దాదాపు 100 చిన్న రథాలను రూపొందించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడమే లక్ష్యంగా ఆయన ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ కళాఖండాన్నిదాదాపు 800 ఇసుక బస్తాలను ఉపయోగించి సుమారు 2 వేల 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దారు. ఇక, గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లోని భగవాన్ జగన్నాథుని 19వ రథయాత్ర అంగరంగవైభవంగా జరుగుతోంది. ఆషాఢ శుద్ధ విదియ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. రాజ్‌కోట్ లోని ప్రసిద్ధ మోకాజీ సర్కిల్ వద్ద ఉన్న జగన్నాథ ఆలయం నుంచి వేలాది మధ్య భక్తుల జయజయధ్వానాల మధ్య రథయాత్ర ప్రారంభమైంది. జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రా దేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతులు ఇచ్చారు. రథయాత్రలో అఘోర వేషధారణలోని కళాకారుల ప్రదర్శన కట్టిపడేసింది. శివుని సాంప్రదాయ వేషధారణలో మరికొంత మంది నందిపై కూర్చుని రథయాత్రను అనుసరించారు.

## ప్రియాంక గాంధీ పేరుతో మోసం

**మొదటిపేజీ తరువాయి -** ఢిల్లీ కార్యాలయం నుంచి 'రాజ్‌కుమార్' అనే వ్యక్తిని మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్న కాలర్, కేరళలో త్వరలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనుందని నమ్మబలికాడు. మంత్రి పదవి కావాలంటే రూ.3 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశాడు. ఇదే నంబర్ నుంచి వడకర ఎంపీ షఫీ పరంబిల్, ఇడుక్కి ఎంపీ డీన్ కురియాకోస్‌లకు కూడా ఇటువంటి కాల్స్ వచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంపై ప్రియాంక గాంధీ వ్యక్తిగత కార్యదర్శి డి.ఎస్. రాజ్‌కుమార్ కేరళ డీజీపీకి, వయనాడ్ ఎస్పీకి అధికారికంగా ఫిర్యాదు చేశారు. దీంతో కల్పేట సైబర్ పోలీసులు, కోజికోడ్ సైబర్ సెల్ వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కాల్స్ ఢిల్లీ నుంచి వచ్చినట్లు గుర్తించిన పోలీసులు, నిందితులు అత్యాధునిక 'కాలర్ స్పూఫింగ్' టెక్నాలజీని ఉపయోగించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే తాను పోలీసులను ఆశ్రయించినట్లు ఎమ్మెల్యే విద్యా బాలకృష్ణన్ తెలిపారు. ఈ విషయాన్ని ఏమాత్రం తేలిగ్గా తీసుకోబోమని వ్యవసాయ మంత్రి టి. సిద్ధిఖీ స్పష్టం చేశారు. మరోవైపు, మంత్రివర్గ విస్తరణ వార్తలను కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ తోసిపుచ్చారు.



## న్యూజిలాండ్‌లో భూకంపం... సునామీ హెచ్చరిక జారీ

**మొదటిపేజీ తరువాయి -** న్యూజిలాండ్‌లో భూకంపం సంభవించింది. దేశంలోని దక్షిణ దీవిలో గురువారం 6.3 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు వెంటనే సునామీ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పశ్చిమ తీర ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఫియోర్డ్‌ల్యాండ్ రీజియన్‌లోని టె అనౌకు 40 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూకంపం కారణంగా మిల్ఫోర్డ్ సౌండ్ నుంచి ప్యూసెగుర్ పాయింట్ వరకు ఉన్న దక్షిణ దీవి పశ్చిమ తీరానికి సునామీ హెచ్చరికలు జారీ చేశారు. సముద్రపు అలలు తీరప్రాంతాల్లోకి చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు తక్షణమే ఎత్తైన ప్రదేశాలకు లేదా లోతట్టు ప్రాంతాల నుంచి దూరంగా వెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నడిచి, పరిగెత్తి లేదా సైకిళ్లపై సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఆస్ట్రేలియన్, పసిఫిక్ టెక్టానిక్ ప్లేట్ల సరిహద్దులో న్యూజిలాండ్ ఉండటంతో ఇక్కడ తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. 2011లో సంభవించిన క్రైస్ట్‌చర్చ్ భూకంపం 185 మందిని బలిగొన్న విషయం తెలిసిందే. తాజా భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ప్రధాన ఆస్తి నష్టం గానీ జరిగినట్లు ఇంకా సమాచారం అందలేదని, పరిస్థితిని సమీక్షిస్తున్నామని జాతీయ అత్యవసర నిర్వహణ ఏజెన్సీ (ఎన్ఈఎంఏ) అధికారులు తెలిపారు.



## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు



**మొదటిపేజీ తరువాయి -** బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యా లతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

## కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు

**మొదటిపేజీ తరువాయి -** చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు. "గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## ఈనెల 22న 'తల్లికి వందనం'

**మొదటిపేజీ తరువాయి -** మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆగస్ట్ 25 వరకు గడువు విధించారు. వీరిలో అర్హులైన వారిని ఆగస్ట్ 30న ప్రకటించి ఆదే రోజు వారి తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తారు. మరోవైపు తల్లికి వందనం పథకం కోసం 1.55 లక్షల మంది ఇళ్ల వివరాలు లేవని విద్యాశాఖ పేర్కొంది. ఈసారి ఈ పథకాన్ని అంగన్వాడీలకు కూడా వర్తింపజేస్తారు. దీంతో మంత్రి లోకేశ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఈ పథకానికి వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేసిన నిబంధనలనే కూటమి ప్రభుత్వం కొనసాగించిన విషయం తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం నెలకు రూ.10,000లు, పట్టణ ప్రాంతాల్లో రూ.12,00లకు మించకూడదు. రేషన్ కార్డు కలిగి ఉండాలి. కుటుంబానికి 3 ఎకరాల్లోపు మగాణి, 10 ఎకరాల్లోపు మెట్ట లేదా రెండూ కలిపి 10 ఎకరాల్లోపు ఉండాలి. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఫోర్ వీలర్ ఉంటే పథకం వర్తించదు. ట్రాక్టర్లు, ఆటోలు, ట్యాక్సీలకు మినహాయింపు ఇచ్చారు. అలాగే సంవత్సరం నటటలకు కరెంట్ వినియోగం సగటున 300 యూనిట్లలోపు ఉండాలి. పురపాలిక పరిధిలో 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ స్థిరాస్తిని కలిగి ఉండకూడదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ తర్వాత పింఛన్ పొందేవారు ఈ పథకానికి అనర్హులు. పారిశుద్ధ్య కార్మికులకు మినహాయింపు ఉంటుంది. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తే ఈ పథకం వర్తించదు. లబ్ధిదారులు రాష్ట్ర గృహ డేటాబేస్‌లో ఉండాలి.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

**మొదటిపేజీ తరువాయి -** తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గవర్నర్ ఆయన నివాసానికి చేరుకుని, ఆయన్ను ఆత్మీయంగా పలకరించారు. శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణుల సూచనలను, సలహాలను తప్పనిసరిగా పాటించాలని పవన్‌కు సూచించారు. ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, ప్రజాసేవలో తన విధులను తిరిగి ప్రారంభించాలని గవర్నర్ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ పర్యటనలో భాగంగా గవర్నర్ జస్టిస్ నజీర్, పవన్ కల్యాణ్ నివాసంలో ఉన్న గ్రంథాలయాన్ని ప్రత్యేకంగా సందర్శించడం విశేషం. ఆ లైబ్రరీలో ఉన్న పలు పుస్తకాలను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. ప్రపంచ ప్రఖ్యాత రచయితలు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రాసిన అనేక గ్రంథాలను చూసి, వాటిపై పవన్ కల్యాణ్‌తో ఉత్సాహంగా చర్చించారు. ఇద్దరి మధ్య పుస్తకాలపై ఆసక్తికరమైన సంభాషణ జరిగింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన అభ్యర్థన మేరకు, జస్టిస్ అబ్దుల్ నజీర్ ఓ పుస్తకంపై తన సంతకం చేశారు. తన ఆరోగ్యం గురించి వాకబు చేసేందుకు స్వయంగా సమయం తీసుకుని ఇంటికి వచ్చిన గవర్నర్‌కు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటన పూర్తిగా మర్యాదపూర్వకంగా, ఆత్మీయ వాతావరణంలో సాగింది.

## 6 నగరాల్లో ఇంటి ఓనర్ల వద్దే నిలిచిపోయిన రూ.1.26 లక్షల కోట్ల డిపాజిట్లు

**మొదటిపేజీ తరువాయి -** మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్) పరిధిలో అత్యధికంగా రూ.41,156 కోట్ల డిపాజిట్లు యజమానుల వద్ద ఉండగా, బెంగళూరు రూ.31,628 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. పట్టణ ప్రాంతాల్లో నివసించే వారి నెలవారీ ఖర్చుల్లో అద్దెకే సింహభాగం వెళుతోందని, దాదాపు సగం మంది తమ ఆదాయంలో 30 శాతానికి పైగా అద్దె కోసమే వెచ్చిస్తున్నారని ఈ సర్వేలో తేలింది. ముఖ్యంగా ముంబైలో 25 శాతం మంది తమ సంపాదనలో సగానికి పైగా అద్దె రూపంలోనే చెల్లిస్తున్నారు. భారీ సెక్యూరిటీ డిపాజిట్ల కారణంగా బెంగళూరులో 75 శాతం మంది తాము కోరుకున్న ఇంటిని అద్దెకు తీసుకోలేకపోయినట్లు నివేదిక వివరించింది. మరోవైపు, సొంత ఇల్లు కొనుగోలు చేయడంతో పోలిస్తే అద్దెకు ఉండటమే మేలని మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. 30 ఏళ్ల గృహ రుణంపై చెల్లించాల్సిన నెలవారీ వాయిదా (ఈఎంఐ) ప్రస్తుతం అద్దె కంటే గణనీయంగా పెరగడమే దీనికి ప్రధాన కారణం. 2021 నుంచి ఈ వ్యత్యాసం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. హైదరాబాద్‌లో ఈఎంఐ-అద్దె నిష్పత్తి 2.21 నుంచి 2.47కి పెరగగా, బెంగళూరులో ఇది 2.07 నుంచి 2.38కి చేరింది. ఇక డిపాజిట్ల వాపసు విషయంలోనూ అద్దెదారులకు చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. ఢిల్లీ-ఎన్సీఆర్‌లో కేవలం 58 శాతం మందికి మాత్రమే పూర్తి డిపాజిట్ తిరిగి వస్తుండగా, 30 శాతం మంది కోతలతో, మరో 12 శాతం మంది తీవ్ర వివాదాల తర్వాత తమ సొమ్మును పొందుతున్నారని నివేదిక పేర్కొంది. ఇంత భారీ మొత్తంలో డిపాజిట్లు యజమానుల వద్దే నిలిచిపోవడం వల్ల అద్దెదారుల ఆర్థిక ప్రణాళికలు, పొదుపుపై తీవ్ర ప్రభావం పడుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# గ్రీన్‌వ్యాలీగా మారనున్న ఓయూ

**మొదటిపేజీ తరువాయి -** సమాజ నిర్మాణంలో వారిని భాగస్వామ్యులను చేసింది. నీళ్లు, నిధులు, నియమకాలే లక్ష్యంగా ఉవ్వెత్తిన ఎగసిన తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లోనూ ఓయూ ముఖ్యపాత్ర పోషించింది. రాష్ట్ర ఆవిర్భానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం కొత్త రూపును సంతరించుకోనుంది. వర్సిటీలో త్వరలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. 108 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆనవాళ్లు భవిష్యత్ తరాలకు తెలిపేలా అత్యాధునిక సాంకేతిక భవన నిర్మాణాలుండేలా సరికొత్తగా తీర్చిదిద్దనున్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో అంతర్భాగమైన ఓయూ భవిష్యత్ తరాల వారికి ఉపయోగపడాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించడంతో పాటు రూ.1,000 కోట్ల నిధులను కేటాయించారు. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక) తయారీని కన్సల్టెంట్లకు అప్పగించారు. దీంతో వర్సిటీ అభివృద్ధికి బాటలు పడనున్నాయి. విశ్వవిద్యాలయంలో చెట్లు, పచ్చిక బయళ్లతో ప్రాంగణమంతా చల్లగా ఉంటుంది. కొత్తగా నిర్మించనున్న ఆధునిక భవనాల ద్వారా పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా కొత్తగా బయో డైవర్సిటీ పార్కును అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రాంగణంలోని చెరువులను సహజ సిద్ధంగా నీళ్లుండే విధంగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు వీలుగా సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నారు. అధికారులు, సందర్శకులు విద్యుత్తు వాహనాల్లో(ఈవీలు) రావాలంటూ సూచిస్తున్నారు. ఇక ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రవేశ(ఎంట్రీ), నిష్క్రమణ మార్గాల(ఎగ్జిట్) వద్ద డిజిటల్ గేట్లను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు ప్రయోజనం కలిగేవిధంగా ఇంటిగ్రేటెడ్ డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేయనున్నారు. పరిశోధనలను ప్రోత్సహించేందుకు ఓయూలో ప్రత్యేకంగా ప్రయోగశాలల కాంప్లెక్స్‌లను నిర్మించనున్నారు. ప్రస్తుతమున్న బయోటెక్నాలజీ, ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, సీపీఎంబీ ప్రయోగశాలల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ ఆధారిత పరిశోధనలు కొనసాగుతున్నాయి. "విశ్వవిద్యాలయం అభివృద్ధిలో భాగంగా పర్యావరణహిత భవనాలను నిర్మించనున్నాం. నూతన అకడమిక్ బ్లాక్, విద్యార్థుల హాస్టళ్ల నిర్మాణాల్లో అత్యాధునిక టెక్నాలజీ వినియోగించనున్నాం. దేశవ్యాప్తంగా ఐఐటీల తరహాలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురానున్నాం. టెండర్లు ఖరారయ్యాక రెండు సంవత్సరాల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ఆవిష్కరించనున్నాం. నాణ్యమైన పరిశోధనల కోసం స్పెషల్ క్లాస్‌లు ప్రారంభించి పరిశోధన నాణ్యత పెంపుపై వర్సిటీ దృష్టి సారించారు. మధ్యలో పరిశోధన నిలిపివేసిన విద్యార్థులతో వ్యక్తిగతంగా సమావేశమై రీసెర్చ్ పూర్తి చేయాలని ప్రోత్సహిస్తున్నారు. సైన్స్ విద్యార్థుల కోసం ఆధునిక ప్రయోగశాలలతో పాటు హిస్టరీ, లింగ్విస్టిక్స్, ఆంగ్లం, సోషియాలజీ తదితర విభాగాల అధ్యాపకులు దేశ, విదేశాల్లో జరిగే జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలు సమర్పించేలా ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. దీంతో కళాశాలలోని వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందిన విద్యార్థులు గడువులోగా పరిశోధనలు పూర్తి చేస్తున్నారు. విద్యార్థులను తరగతి గదులకు మాత్రమే పరిమితం చేయకుండా వారిలోని నిగూఢమైన ప్రతిభను వెలికితీసేందుకు కల్చరల్, డిబేట్ మీడియా, స్పోర్ట్స్ క్లబ్‌లను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి నెల ఈ క్లబ్‌ల ఆధ్వర్యంలో సమావేశాలు, పోటీలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న స్కిల్స్‌ను ప్రోత్సహిస్తున్నారు.



www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

# జన్మనిచ్చిన గోకవరం గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా..

**ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నూతన ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన కంబాల శ్రీనివాసరావు**

**రూ.3 లక్షలు విరాళంతో ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం**






**గోకవరం,జులై 16 .అక్షర టైమ్స్ :** తనకు జన్మనిచ్చిన గోకవరం గ్రామ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని, విశ్వహిందూ దర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు అన్నారు. ప్రయాణికులు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో గోకవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ప్రజా సేవే పరమావధిగా భావిస్తున్న కంబాల శ్రీనివాసరావు, గోకవరం ప్రాంత ప్రజలకు, ప్రతిరోజూ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం తన సొంత నిధుల నుంచి రూ.3 లక్షలు విరాళాన్ని అందజేసి, ఈ ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేసారు. తొలిత ఆయనకు ఆర్టీసీ యాజమాన్యం సిబ్బంది, కార్మికులు, ఘన స్వాగతం పలికి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, బస్టాండ్ ప్రాంతాలకు వచ్చే ప్రయాణికులు, విద్యార్థులు, కార్మికులు, ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోకవరంలోనే కాకుండా కోరుకొండ, జగ్గంపేట రాజానగరం, సీతానగరం ఆర్టీసీ కాంప్లెక్స్ లో కూడా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తానని వెల్లడించారు. అలాగే గోకవరం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గుబ్బాలమ్మ ఆలయం వద్ద భారీ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అదే విధంగా గోకవరం గ్రామ ప్రజల అత్యవసర సమయంలో ఉపయోగపడే విధంగా ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తానని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. గోకవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండటంతో, ఈ ఆర్వో ప్లాంట్ వారి దాహార్తిని తీర్చడంతో పాటు ఆరోగ్యకరమైన తాగునీటిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూ, విద్య, వైద్యం, తాగునీరు, దేవాలయాల అభివృద్ధి వంటి రంగాల్లో తనవంతు సహాయ, సహకారాలు అందిస్తున్నానని తెలిపారు. తాను పుట్టి, పెరిగిన గోకవరం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు కృషిచేసిన కంబాల శ్రీనివాసరావుకి రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, గోకవరం ఆర్టీసీ మేనేజర్ సుచరిత, సిబ్బంది, కార్మికులు, స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# "పల్లెబాటలో ఈగల్ కార్యక్రమం"

**అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, గుమ్మల్లదొడ్డి**

**గోకవరం,జులై 16 .అక్షర టైమ్స్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడం, అలాగే జీరో కల్టి వేషన్ అఫ్ గంజా (గంజాయి సాగు నిర్మూలన) అనే లక్ష్యాలను సాధించేందుకు ఈగల్ (ఈగల్ ) ఆధ్వర్యంలో గుమ్మలదొడ్డి విలేజ్ లో యున్న "అస్సాగో ఇండస్ట్రీస్" ఉద్యోగినీ ఉద్యోగులకు "పల్లెబాటలో ఈగల్" అవగాహన కార్యక్రమం నిర్వహించడం









జరిగింది. ఈ కార్యక్రమంలో వికె.శుక్లా వైస్ ప్రెసిడెంట్ ,దేవేందర్ కుమార్ ,యూనిట్ హెడ్ పుల్లా రెడ్డి,ఏవీపీ భవాని శంకర్,మేనేజర్, అడ్మినిస్ట్రేషన్ సెక్యూరిటీ,సన్యాసి రావు హెచ్ఆర్ మేనేజర్,రాజ్‌కుమార్ సేఫ్టీ ఆఫీసర్ మరియు ప్లాంట్ ఎంప్లాయీస్ 100 మంది పాల్గొన్నారు. వారందరికీ మాదకద్రవ్యాల వినియోగం వల్ల, వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ జీవితం, సమాజం మరియు దేశ భవిష్యత్తుపై కలిగే దుష్పరిణామాలను ఈగల్ అధికారులు పీ.వి. సూర్య మోహన్ రావు -- పోలీస్ ఇన్‌స్పెక్టర్, ఈగల్ తూర్పు గోదావరి మరియు పోలవరం జిల్లా హెచ్.సి. మధు ,పీ.సి. నాయుడు ,పీ.సి. రాజు వివరంగా తెలియజేయడం జరిగింది. వారు నివాసముంటున్న ప్రాంతాల్లో ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతున్నట్లు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించిన వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి సమాచారం అందించాలని విజ్ఞప్తి చెయ్యడం జరిగింది. అలాగే ప్రతి గ్రామాన్ని "డ్రగ్ ఫ్రీ విలేజ్"గా, ప్రతి మండలాన్ని "జీరో గంజాయి సాగు ప్రాంతం"గా తీర్చిదిద్దేందుకు ప్రజల మరియు ఉద్యోగుల సహకారం ఎంతో అవసరమని వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలన అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొనడం జరిగింది. హాజరైన ఉద్యోగులచే డ్రగ్స్ రహిత ఏపీ కొరకు ప్రతిజ్ఞ చేయించడమైనది.

# బోనాలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహా సంబరం

**భక్తి, జానపదం, ఆత్మగౌరవం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన తెలంగాణ ఆత్మ**





**జులై 16 .అక్షర టైమ్స్ :** "బోనం అంటే కేవలం నైవేద్యం కాదు.. అది తెలంగాణ తల్లి ఒడిలో పుట్టిన ప్రతి బిడ్డ భక్తికి, సంస్కృతికి, సంప్రదాయానికి, ఆత్మగౌరవానికి ప్రతీక."భారతదేశం అనేక సంస్కృతులు, సంప్రదాయాలు, పండుగలకు పుట్టినిల్లు. ప్రతి రాష్ట్రానికి తనదైన ప్రత్యేకత ఉంది. అయితే తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే పండుగలలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. ఆషాఢ మాసం రాగానే తెలంగాణ అంతటా అమ్మవారి ఆలయాలు భక్తజన సందోహంతో కళకళలాడుతాయి. డప్పుల మోతలు, శివసత్తుల పూనకాలు, పోతురాజు విన్యాసాలు, ఘటం ఊరేగింపులు, మహిళల తలపై అలంకరించిన బోనాలు, జానపద గీతాలు... ఇలా ప్రతి వీధి ఒక ఆధ్యాత్మిక వేదికగా మారిపోతుంది.

### 'బోనం' అనే పదానికి అర్థం

"బోనం" అనే పదం "భోజనం" అనే పదం నుంచి వచ్చింది. అమ్మవారికి ప్రేమతో, భక్తితో సమర్పించే నైవేద్యమే బోనం. కొత్త కుండలో బియ్యం, పాలు, బెల్లంతో అన్నం వండి, పసుపు, కుంకుమతో అలంకరించి, వేపాకులు, దీపంతో అలంకరించిన ఆ బోనాన్ని మహిళలు తలపై మోసుకుంటూ ఆలయానికి తీసుకెళ్లడం ఈ పండుగలో అత్యంత పవిత్రమైన ఘట్టం.

### బోనాల చరిత్ర శతాబ్దాల సంప్రదాయం

బోనాల పండుగకు శతాబ్దాల చరిత్ర ఉంది. తెలంగాణ ప్రాంతంలో అంటువ్యాధులు, ముఖ్యంగా కలరా వంటి వ్యాధులు వ్యాపించిన సమయంలో ప్రజలు గ్రామదేవత అయిన మహంకాళి అమ్మవారిని ప్రార్థిస్తూ, తమ గ్రామాన్ని కాపాడాలని మొక్కుకున్నారు. వ్యాధులు తగ్గిన తరువాత కృతజ్ఞతగా అమ్మవారికి బోనం సమర్పించడం ప్రారంభమైందని ఒక చారిత్రక కథనం చెబుతుంది. మరోవైపు, తెలంగాణలోని అనేక గ్రామాల్లో గ్రామదేవతల ఆరాధన కాకతీయుల కాలం నుంచే విస్తృతంగా ఉండేదని చరిత్రకారులు పేర్కొంటున్నారు. గ్రామ రక్షణ, పంటల అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం, శాంతి కోసం గ్రామదేవతలను ఆరాధించే సంప్రదాయం కాలక్రమేణా బోనాల మహోత్సవంగా రూపుదిద్దుకుంది.

### ఆషాఢ మాసంతో బోనాల అనుబంధం

వర్షాకాల ప్రారంభమైన ఆషాఢ మాసంలో ప్రకృతిలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ కాలంలో అంటువ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉండేది. అందుకే గ్రామదేవతలను ప్రసన్నం చేసుకొని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ బోనాల ఉత్సవాన్ని నిర్వహించే ఆచారం ఏర్పడింది. ఇది ప్రకృతితో మనిషి అనుబంధాన్ని ప్రతిబింబించే గొప్ప సంప్రదాయం.

### మహిళల పాత్ర భక్తికి ప్రతిరూపం

బోనాల పండుగలో మహిళల పాత్ర అత్యంత విశిష్టమైనది. తెల్లవారుజామునే స్నానమాచరించి, కొత్త వస్త్రాలు ధరించి, పసుపు, కుంకుమలతో బోనాన్ని అలంకరించి తలపై మోసుకుంటూ అమ్మవారి ఆలయానికి వెళ్లడం భక్తి, విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుంది. కుటుంబ శ్రేయస్సు, పిల్లల ఆరోగ్యం, సమాజ సంక్షేమం కోసం మహిళలు చేసే ఈ ఆరాధన బోనాల ప్రత్యేకత.

### పోతురాజు బోనాల ఉత్సవానికి ప్రాణం

బోనాలంటే గుర్తొచ్చే తొలి రూపం పోతురాజు. అమ్మవారి సోదరుడిగా భావించే పోతురాజు శరీరానికి పసుపు రాసుకుని, నడుముకు గంటలు కట్టుకుని, చేతిలో కొరడా పట్టుకుని డప్పుల మోతకు అనుగుణంగా నృత్యం చేస్తాడు. అతని అడుగులు ధైర్యానికి, శక్తికి, చెడుపై మంచి విజయానికి ప్రతీకగా భావిస్తారు.

### ఘటం దైవశక్తికి ప్రతిరూపం

బోనాల వేడుకల్లో ఘటం ప్రత్యేక ఆకర్షణ. పవిత్ర జలాలతో నింపిన కుండను అమ్మవారి ప్రతిరూపంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఘటం ఊరేగింపు వేలాది మంది భక్తుల మధ్య అత్యంత వైభవంగా సాగుతుంది. చివరగా పవిత్ర జలాల్లో ఘటాన్ని నిమజ్జనం చేయడం ద్వారా ఉత్సవాలు ముగుస్తాయి.

### శివసత్తులు భక్తి పరవశానికి నిదర్శనం

బోనాల సందర్భంగా శివసత్తులు పూనకం వచ్చి అమ్మవారి సందేశాలను చెబుతారని ప్రజల విశ్వాసం. గ్రామ ప్రజల సంక్షేమం, భవిష్యత్తు గురించి వారు చెప్పే మాటలను భక్తులు విశ్వాసంతో ఆలకిస్తారు. ఇది తెలంగాణ జానపద విశ్వాసాల్లో ఒక ప్రత్యేక అంశం.

### జానపద కళల సమ్మేళనం

బోనాల పండుగ కేవలం ఆధ్యాత్మిక ఉత్సవం మాత్రమే కాదు. ఇది తెలంగాణ జానపద కళలకు మహా వేదిక. డప్పు, తప్పెటగుళ్లు, ఒగ్గుకథ, బుర్రకథ, కోలాటం, జానపద నృత్యాలు, సంప్రదాయ సంగీతం వంటి కళారూపాలు బోనాల సందర్భంగా ప్రజలను అలరిస్తాయి. గ్రామీణ కళాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కూడా ఈ పండుగ కల్పిస్తుంది.

### సామాజిక ఐక్యతకు ప్రతీక

బోనాలు కుల, మత, వర్గ, ఆర్థిక భేదాలకు అతీతమైన పండుగ. ఒకే ఊరిలోని ప్రజలంతా కలిసి ఆలయాలను అలంకరించడం, అన్నదానాలు నిర్వహించడం, సేవా కార్యక్రమాలు చేపట్టడం, ఒకరినొకరు ఆహ్వానించడం ద్వారా సామాజిక ఐక్యత బలపడుతుంది. ఇది తెలంగాణ సమాజంలోని సామరస్యాన్ని ప్రతిబింబిస్తుంది.

### హైదరాబాద్ బోనాల వైభవం

హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. గోల్కొండ జగదాంబిక అమ్మవారి ఆలయంలో ప్రారంభమయ్యే బోనాలు, ఉజ్జయిని మహంకాళి ఆలయం, లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయం, అక్కన్న--మాదన్న మహంకాళి ఆలయాల వరకు అత్యంత వైభవంగా కొనసాగుతాయి. లక్షలాది మంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొంటారు.

### తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బోనాల పండుగకు ప్రభుత్వ స్థాయిలో మరింత ప్రాధాన్యం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలను నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహించడం, ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించడం, భక్తులకు సౌకర్యాలు కల్పించడం ద్వారా బోనాలను ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేస్తోంది.

### బోనాలు ఒక జీవన తత్వం

బోనాలు మనకు భక్తిని మాత్రమే కాదు, కృతజ్ఞతను కూడా నేర్పిస్తాయి. ప్రకృతి, గ్రామం, కుటుంబం, సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేస్తాయి. మన సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యతను గుర్తుచేస్తాయి. ప్రతి బోనం వెనుక ఒక తల్లి ప్రార్థన ఉంటుంది... ప్రతి డప్పు మోత వెనుక ఒక సంస్కృతి ఉంటుంది... ప్రతి పోతురాజు అడుగులో తెలంగాణ గర్వం కనిపిస్తుంది.

### ముగింపు

బోనాలు తెలంగాణ ప్రజల జీవన విధానం, జానపద సంప్రదాయం, సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మిక విశ్వాసం, సామాజిక ఐక్యత, ఆత్మగౌరవానికి చిరస్మరణీయ చిహ్నం. ఈ మహోత్సవం కేవలం ఆలయాలకే పరిమితం కాదు; ప్రతి ఇంటిలో, ప్రతి హృదయంలో, ప్రతి తెలంగాణ బిడ్డ గుండెల్లో నిలిచిపోయిన ఒక భావోద్వేగం. బోనాల వైభవం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తూ, తెలంగాణ సంస్కృతి వైశిష్ట్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతూనే ఉంటుంది.



అక్షర టైమ్స్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి గోపగాని పాండు

## "సర్" ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు పని చేయాలి.!

**కాంగ్రెస్ శ్రేణులకు మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపు..**






**ఉప్పల్,జులై 16 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి హరి మోహన్ రెడ్డి)** ఉప్పల్ లో సర్ ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ లోని మాల్ మైసమ్మ దేవాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి గురువారం పరిశీలించారు. నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి అన్నారు. బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## తిమ్మరాజు చెరువుకు ఏలేరు జలాలు విడుదల

**గంగమ్మకు పూజలు నిర్వహించి నీటిని విడుదల చేసిన కూటమి నాయకులు**



**ఏలేశ్వరం,జులై 16 .అక్షర టైమ్స్ :** ఏలేరు జలాశయం నుంచి తిమ్మరాజు చెరువుకు సాగునీటిని విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం మండల ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి),మండల టీడీపీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు,ఏలేరు డీసీ మెంబర్ ఎస్ వి జి సుబ్బరాజు,లింగంపర్తి సొసైటీ అధ్యక్షులు పెంటకోట మోహన్,వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి లక్ష్మణరావు,జిగటాపు సూరిబాబు,పలు గ్రామాల నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొని నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి,మండల టీడీపీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు మాట్లాడుతూ రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించి పంటలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి సంఘాల ప్రతినిధులు సహకరించాలని సూచించారు.

## బోనాల నిధులపై కీలక ప్రకటన ఆలయ కమిటీలకు పిలుపు

**చర్లపల్లి--కుషాయిగూడ డివిజన్‌ల అర్హత కలిగిన ఆలయాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం**

**కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పిలుపు**



**కాప్రా,జులై 16 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** ఆషాఢ మాస బోనాల పండుగలను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిన నేపథ్యంలో చర్లపల్లి, కుషాయిగూడ డివిజన్‌ల పరిధిలోని అర్హత కలిగిన ఆలయ కమిటీలు వెంటనే దరఖాస్తులు సమర్పించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పిలుపునిచ్చారు. ఈ అంశంపై ఉప్పల్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయ కార్యనిర్వాహక అధికారి వెంకన్నతో ఆమె ప్రత్యేకంగా చర్చించి, నిధుల దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నందున, అర్హత కలిగిన ఒక్క ఆలయం కూడా ఈ అవకాశాన్ని కోల్పోకుండా అవసరమైన పత్రాలతో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, భక్తుల భాగస్వామ్యంతో జరిగే ఈ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వ సహకారం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నిధుల కోసం దరఖాస్తు చేసుకునే ఆలయ కమిటీలు ఆలయ నమోదు ధ్రువీకరణ పత్రం, ఆలయ లెటర్‌ప్యాడ్, ఆలయ ఫోటో, కమిటీ అధ్యక్షుడు, ఖజాంచీ ఆధార్ కార్డుల ప్రతులు, బ్యాంకు పాస్‌బుక్ ప్రతితో పాటు గత సంవత్సరం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించిన చెక్కు ప్రతిని తప్పనిసరిగా జతపరచాలని సూచించారు. పత్రాల్లో ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి వివరాలతో దరఖాస్తులను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అన్ని అవసరమైన పత్రాలతో కూడిన దరఖాస్తులను ఉప్పల్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలోని కార్యనిర్వాహక అధికారి కార్యాలయంలో వీలైనంత త్వరగా సమర్పించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన ఆలయ కమిటీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ నిధులను పొందాలని ఆమె కోరారు.

## కంబం చెరువు నుండి పంట పొలాలకు నీటి విడుదల



**కంభం,జులై 16 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి మల్లాపురం సాగర్)** గిద్దలూరు నియోజకవర్గం కంబం చెరువు నుండి పంట పొలాలకు నీటిని విడుదల నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ పద్ధతిలో గంగమ్మ తల్లికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెరువు నుండి సాగునీటిని విడుదల చేసి రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు సకాలంలో సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి ఎకరాకు నీరు అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. నీటిని వృధా చేయకుండా భూగర్భ జలాలు పెంచుకోవాల్సిన అవశ్యకత ఉంది అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల,పార్టీ నాయకులు,అధికారులు, రైతులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన వినూత్న స్కూల్ విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు



**గిద్దలూరు,జులై 16 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి మల్లాపురం సాగర్)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందజేసే షైనింగ్ స్టార్ అవార్డుకు వినూత్న స్కూల్ స్కూల్ కు చెందిన విద్యార్థిని శ్రీ వర్ష ఎంపికయ్యారు.శ్రీవర్ష గిద్దలూరులోని స్థానిక వినూత్న హైస్కూల్లో పదవ తరగతి చదివింది.2026 వ సంవత్సరంలో ఏప్రిల్ లో విడుదల చేసిన పబ్లిక్ పరీక్షల్లో మార్కాపురం జిల్లా లోనే ప్రథమ స్థాయిలో నిలిచింది.శ్రీ వర్ష స్వగ్రామం గిద్దలూరు మండలం కొత్తపల్లి గ్రామం.ఈ అవార్డుకు ఎంపికైన శ్రీ వర్ష కు వినూత్న విద్యాసంస్థల యాజమాన్యం ఖాజావలి, భూషణం రెడ్డి, చంద్రశేఖరు రెడ్డి అభినందనలు తెలియజేశారు.

## రాచర్ల స్పందన విద్యా సంస్థల విద్యార్థుల అద్భుత ప్రతిభ ఐదుగురు విద్యార్థులకు సైనింగ్ స్టార్ అవార్డులు




**రాచర్ల,జులై 16 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి మల్లాపురం సాగర్)** రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థుల ప్రతిభను గుర్తించి అందజేసే షైనింగ్ స్టార్ అవార్డులకు రాచర్ల మండలంలోని స్పందన విద్యాసంస్థల విద్యార్థులు ఎంపికై అద్భుత ప్రతిభ చాటారు.రాచర్ల మండలానికి గాను మొత్తం ఏడుగురు విద్యార్థులుఎంపిక కాగా స్పందన విద్యాసంస్థకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఈ అవార్డులకు ఎంపిక కావడం విశేషం.ఎంపికైన విద్యార్థులలో ఎస్. రెహానా, వీ.నాగ సురేంద్ర, పి.దివ్య, ఓ. అక్షయ్. పీవీ. షణ్ముఖ రెడ్డి ఉన్నారు.తమ ప్రతిభతో ప్రతిష్టాత్మకమైన అవార్డులకు ఎంపికై విద్యసంస్థకు, తల్లి దండ్రులకు గర్వకారణం గా నిలిచారు.విద్యార్థులను ఇంతటి ఉన్నత స్థాయికి తీర్చి దిద్దిన ఉపాధ్యాయులను యాజమాన్యం పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి,ప్రిన్సిపాల్ సుష్మిత రెడ్డి,స్థానికులు మరియు తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.రాచర్ల మండలం లో ఏడు మంది విద్యార్థులుకు గాను ఐదుగురు విద్యార్థులు స్పందన విద్య సంస్థల నుంచే ఎంపిక అవ్వడం గమనార్హం.ఈ అవార్డులకు ఎంపికఐన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదగా ఇరవై వేల రూపాయల నగదు,సర్టిఫికెట్, మెమెంటో ఇవ్వనున్నారు.

## పూడికతీత పనులకు శ్రీకారం చుట్టిన శ్రీహరి నాయుడు





**కావలి/దగదర్తి,జులై 16 .అక్షర టైమ్స్ :** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు దగదర్తి మండలం తడకలూరు గ్రామపరిధి లోని కట్టుగుమ్మ కాలువ నుంచి అనచెరువు మరియు పెద్ద చెరువు సప్లై కెనాల్ పూడిక తొలగింపు పనులు గురువారం శరవేగంగా ప్రారంభం చేశారు. గుర్రపుడెక్క ఆకుతో పూర్తిగా మూసుకుపోయిన కాలువ వల్ల సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న రైతులను దృష్టిలో పెట్టుకొని 11.74 లక్షలు రూపాయలు మంజూరు చేసినట్లు దగదర్తి మండల క్లస్టర్ ఇన్‌చార్జి జలదంకి శ్రీహరి నాయుడు ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కాలువ సమస్యను పరిష్కరించిన తెలుగుదేశం (కూటమి) ప్రభుత్వంనకు మరియు కావలి ఎమ్మెల్యే కి ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్లూరు మండలంలోని రిసర్వ్ లోపాలను సరిచేసి న్యాయం చేయండి

### న్యాయవాది ఇర్ల వెంకటరమణయ్య



**కావలి/అల్లూరుజులై 16 .అక్షర టైమ్స్ :** కావలి నియోజకవర్గం లోని అల్లూరు మండలంలో గతంలో జరిగిన రిసర్వ్ ద్వారా చోటుచేసుకున్న లోపాలను సరిచేసి బాధితులకు న్యాయం చేయాలని ప్రముఖ న్యాయవాది, సామాజిక వేత్త ఇర్లా వెంకటరామయ్య తెలిపారు. గురువారం అల్లూరు తహసిల్దార్ నవీన్ కుమార్ ను ఆయన ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో భూ సమస్యలను సత్వరమే పరిష్కరించి గతంలో జరిగిన రీ సర్వే లోపాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పలు రకాల అంశాలపై చర్చించి సత్వర న్యాయం చేయాలని సూచించారు. ఆయన వెంట హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు సాల్మన్ మరియు ఉపాధ్యక్షుడు బాబురావు తదితరులు ఉన్నారు.

## పరుగుల బామ్మ మాణికల రామ సుబ్బమ్మ కు సంతాపం



**కావలి,జులై 16 .అక్షర టైమ్స్ :** కావలి స్థానికులు వెటర్నర్ రన్నర్ పరుగుల బామ్మ మాణికల రామ సుబ్బమ్మకు ప్రముఖ వైద్యులు , మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్ ప్రభాకర నాయుడు ఆధ్వర్యంలో వారి హాస్పిటల్ నందు సంతాప సభ గురువారం కావలిలో చేపట్టారు. స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్ ఖాదర్ బాష ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ మాణికల రామ సుబ్బమ్మ 1948 జూన్ 1వ తేదీ జన్మించి, 2026 జూలై 6వ తేదీ అనారోగ్యంతో నెల్లూరులో స్వర్గస్తు లయ్యారనీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రామ సుబ్బమ్మ సంతాప సభలో ఆమె చిత్ర పటము నకు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. వక్తలు మాట్లాడుతూ రామ సుబ్బమ్మ, ఒక నీరు పేద గిరిజన కుటుంబంలో జన్మించి కావలి విశ్వోదయ బాలికొన్నత పాఠశాలలో చదువులు కొనసాగించి, కూలీ పనులు చేసు కుంటు, క్రీడలలో ఆసక్తితో, పట్టుదలతో, పరుగు పందెం, షార్ట్ ఫుట్, జావెలిన్ త్రో క్రీడల్లో ఆసక్తితో రాణించి అందరి , ప్రేమాభిమానాలు పొందారని, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ లో సభ్యులుగా చేరి జాతీయ స్థాయిలో జరిగే మాస్టర్ అథ్లెటిక్స్ లో పాల్గొని బంగారు పథకాలు 32, సిల్వర్ 14, కాంస్య మూడు, మొత్తం 49పతకాలు సాధించి, కావలి కీర్తి ప్రతిష్టలు పెంపొందించారు అని కొనియాడారు. రామ సుబ్బమ్మ, గొప్ప క్రీడా స్ఫూర్తికి పట్టుదలకు నిలువెత్తు రూపమని, మాస్టర్ అథ్లెటిక్స్ లో ఆమె సాధించిన విజయాలు నేటి యువతకు స్ఫూర్తి దాయకమని కొని యాడారు. క్రీడా మైదానంలో ఆమె చూపిన చొరవ క్రమశిక్షణ, అంకిత భావం, ఎప్పటికి గుర్తుండి పోతాయి అని, రామ సుబ్బమ్మ వయస్సు పైబడిన, క్రీడా రంగమును ఎంచుకొని అందులో రాణించి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పై కార్యక్రమంలో ఆయా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్య పరిష్కారమే పల్లె వీక్షణ లక్ష్యం..: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల




**పొదలకూరు,జులై 16 .అక్షర టైమ్స్ : (రిపోర్టర్ ఆనంద్)** జిల్లాలో వినూత్నంగా నిర్వహిస్తున్న "పల్లె వీక్షణ" లక్ష్యం ప్రతి సమస్యకు పరిష్కారమేనని..కార్యక్రమంలో ప్రజలు అందజేస్తున్న అర్జీలను 30 రోజుల్లో పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు.గురువారం పొదలకూరు మండలం పులికల్లు గ్రామంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ పల్లె వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.తొలుత ఎమ్మెల్యేతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్, పులికల్లు గ్రామ సమీపంలో చేపడుతున్న వీబీజీ--రాంజీ ఉపాధి హామీ పనులను పరిశీలించి పనుల నాణ్యతపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో మమేకమై వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. తాగునీటి నాణ్యతను పరిశీలించి, గ్రామంలో మినీ గోకులాన్ని ప్రారంభించారు.అనంతరం జిల్లాస్థాయి అధికారులతో కలిసి గ్రామస్తులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన కలెక్టర్, ఎమ్మెల్యే ప్రజల నుంచి పలు అర్జీలు స్వీకరించారు. అందిన ప్రతి అర్జీని వెంటనే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు వివరించిన సమస్యలను క్షుణ్ణంగా ఆలకించి, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు.పర్యటన సందర్భంగా గ్రామస్తులు ప్రస్తావించిన అనేక సమస్యలకు కలెక్టర్, ఎమ్మెల్యే వెంటనే పరిష్కారం చూపించారు. గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ మంజూరు చేయాలని కోరగా వెంటనే ఆమోదించారు. విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సు సమయాన్ని అరగంట ముందుకు మార్చాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పశువుల సంరక్షణ కోసం మినీ గోకులాలు మంజూరు చేయాలని పాడి రైతులు కోరగా వెంటనే 10 గోకులాలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గ్రామానికి ప్రతి వారం 104 వైద్య సేవలు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.తమ గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్ గ్రామ సమస్యలను తక్షణమే పరిష్కరించడంపై గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నూటికి నూరు శాతం సమర్థవంతంగా అమలవుతున్నాయా? అర్హులందరికీ అందుతున్నాయా? అనే విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించడమే "పల్లె వీక్షణ" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకుని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.పల్లె వీక్షణలో అందిన ప్రతి అర్జీని ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, నెల రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పులికల్లు గ్రామంలో ప్రభుత్వ పథకాల అమలు సంతృప్తికరంగా ఉందన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు, వీబీజీ-రాంజీ పనుల పురోగతి ప్రశంసనీయంగా ఉన్నాయని పేర్కొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రం పనితీరు కూడా ఎంతో బాగుందని, చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విద్యా కిట్లు అందిస్తోందన్నారు.జిల్లాలో 700 పైగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఉండగా ఆరు నెలల క్రితం వరకు కూడా కేవలం 100 కంటే తక్కువ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు మాత్రమే పనిచేస్తుండగా, ప్రస్తుతం 240కు పైగా కేంద్రాలు వినియోగంలోకి రావడం అభినందనీయమని పేర్కొంటూ జిల్లా పంచాయతీ అధికారి వసుమతిని ప్రత్యేకంగా అభినందించారు. త్వరలోనే అన్ని కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.ప్రతి గ్రామంలోని సమస్యలు కార్యాలయాలకు చేరుకోవడంలో కొంత జాప్యం జరుగుతుందని, కానీ క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలిసి వెంటనే పరిష్కారం చూపే అవకాశం ఉంటుందని చెప్పారు. పులికల్లు గ్రామంలో గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం ఇందుకు నిదర్శనమన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పల్లె వీక్షణ నిర్వహించినప్పుడు పరిధిలోని అన్ని గ్రామాల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక చొరవ అభినందనీయం.. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనతో ప్రారంభించిన పల్లె వీక్షణ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తుండటం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ-సర్వే కారణంగా నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో సమస్యలు తలెత్తాయని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. కందులేరు జలాశయం మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో పాటు చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు కూడా నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే సర్వేపల్లి జోసఫ్‌పేట, అంకుపల్లి మెయిన్ స్కూల్‌ల మార్పిడి అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉన్నతి పథకం ద్వారా లబ్ధిదారులకు రుణాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, ఆర్డీఓ అనూష, డీపీఓ వసుమతి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ ఎస్ఈలు కోటేశ్వరరావు, రాఘవేంద్రన్, పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్, జడ్పీ డిప్యూటీ సీఈవో బ్రహ్మయ్య, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## రూరల్ నియోజకవర్గంలో 60 కోట్లతో 97 పనులు

**48 కిలో మీటర్ల పొడువునా డ్రైన్ నిర్మాణం**

**పార్టీలకు అతీతంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం**

**ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి**





**నెల్లూరు,జులై 16 .అక్షర టైమ్స్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 1వ డివిజన్, కోడూరుపాడు కల్తీ కాలనీలో 80 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ పనులకు గురువారం శంకుస్థాపనకు శ్రీకారం చుట్టారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మరియు టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు. పొదలకూరు రోడ్డు - గాంధీ నగర్ రోడ్డు తరహాలో కొత్త కాలువ సెంటర్ లో త్వరలో సెంట్రల్ లైటింగ్ ను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ వయసులో కూడా రాష్ట్రం కోసం ఎంతగానో శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రజలందరి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి అని అన్నారు. నెల్లూరు రూరల్ అభివృద్ధికి అన్నిరకాలుగా సహకరిస్తున్న ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్, మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలపక్షాన ప్రత్యేక దన్యవాదాలు తెలియజేసారు. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కుడుముల చిరంజీవి, కో క్లస్టర్ ఇంచార్జ్ తమ్మి శ్రీనివాసులు, కోడూరుపాడు పి.ఏ.సి.ఎస్. ఛైర్మన్ గంగి జయరామి రెడ్డి, 1వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు జావీద్, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, టీడీపీ నాయకులు యనమల శ్రీహరి యాదవ్, యనమల శేషు యాదవ్, తమ్మి శ్రీనివాసులు, దొంతు విజయ్ కుమార్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులు, ప్రాణాంతక వ్యాధులున్న ఖైదీల ముందస్తు విడుదల! రాష్ట్రాలకు సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

**రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు- 70 ఏళ్లు పైబడిన, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీల విడుదలపై పాలసీ రూపొందించాలని స్పష్టం- 3 నెలల గడువు**



దేశంలోని జైళ్లలో మగ్గుతున్న వృద్ధులు, ప్రాణాంతక వ్యాధులతో (టెర్మినల్ ఇల్‌నెస్) బాధపడుతున్న ఖైదీలకు మానవతా దృక్పథంతో ఉపశమనం కల్పించేలా సుప్రీం కోర్టు గురువారం ఒక చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. వృద్ధాప్య సమస్యలతో సతమతమవుతున్న లేదా నయం కానీ వ్యాధులతో ఉన్న ఖైదీల ముందస్తు విడుదల విషయంలో కీలక వ్యాఖ్యలు చేసింది. 3 నెలల వ్యవధిలోగా ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించి, నోటిఫై చేయాలని దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్ని సుప్రీం కోర్టు ఆదేశించింది.

**నల్సా (NALSA) పిటిషన్‌పై స్పందన**

జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ సంచలన తీర్పును ఇచ్చింది. జైళ్లలో ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీలు లేదా 70 ఏళ్లు పైబడిన వారిని బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (హీూూూూ) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ఖైదీల విడుదల ప్రక్రియకు సంబంధించిన అన్ని అర్హత ప్రమాణాలు, అనుసరించాల్సిన విధానాల్ని ఆ పాలసీలో స్పష్టంగా పొందుపరచాలని ధర్మాసనం పేర్కొంది. ముఖ్యంగా ఎవరిని విడుదల చేయాలనే విషయంలో గందరగోళం లేకుండా ఉండేందుకు ప్రాణాంతక వ్యాధి అనే దానికి స్పష్టమైన, ఒకే రకమైన నిర్వచనాన్ని రాష్ట్రాలు తయారు చేయాలని కోర్టు ఆదేశించింది. రాష్ట్రాల్ని బట్టి ప్రస్తుతం వేర్వేరు ప్రమాణాలు పాటించే అవకాశం ఉన్నందున, ఖైదీల అర్హత నిర్ణయంలో ఈ పాలసీల రూపకల్పనలో ఏకరీతి విధానం అవసరం అని పేర్కొంది. ఇందుకోసం సంబంధిత రాష్ట్రాల లీగల్ సర్వీసెస్ అథారిటీలతో (ూూూూం) సంప్రదింపులు జరిపి సలహాలను కూడా తీసుకోవాలని సూచించింది. దీంతో ఖైదీల గుర్తింపు మరింత వేగంగా జరుగుతుందని, దరఖాస్తుల్ని సమర్థంగా పరిశీలించడం సులభం అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది.

**సమయపాలన, పారదర్శకత తప్పనిసరి**

వీరి కారుణ్య విడుదల కోసం సుప్రీం కోర్టు కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఖైదీలు స్వయంగా లేదా వారి కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా సులభమైన, పారదర్శకమైన ప్రక్రియ ఉండాలని పేర్కొంది. ఇంకా కాలయాపన కాకుండా కచ్చితమైన సమయ పరిమితిలోపు ఈ దరఖాస్తుల్ని పరిశీలించేలా ఒక సరళమైన విధానాన్ని తీసుకురావాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని, డిజిటల్ మౌలిక సదుపాయాల్ని, సిబ్బంది సామర్థ్యం పెంపు, అధికారులకు శిక్షణ వంటి అంశాల్లో రాష్ట్రాలకు సహకరించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది సుప్రీం కోర్టు. తీర్పు వెలువడిన తేదీ నుంచి 6 నెలల లోపు దీనికి సంబంధించిన పురోగతిపై అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్ని న్యాయస్థానం ఆదేశించింది. విడుదలకు అర్హత ప్రమాణాలు, దరఖాస్తు చేసుకునే విధానం, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ, నిర్ణయం తీసుకునే గడువు, విడుదల అమలు విధానం వంటి అంశాల్ని స్పష్టంగా పొందుపరచాలని ధర్మాసనం పేర్కొంది.

**కిక్కిరిసిపోతున్న జైళ్లు**

జైళ్లలో వృద్ధులు, రోగులకు తగిన రీతిలో వైద్య సేవలు అందట్లేదని, వారికి ప్రత్యేక శ్రద్ధ, నిరంతర పర్యవేక్షణ అవసరం అని నల్సా తన పిటిషన్‌లో పేర్కొంది. కానీ జైళ్లలో అధిక రద్దీ కారణంగా అలాంటి సంరక్షణ అందించడం కష్టమవుతోందని తెలిపింది. నల్సా సమర్పించిన వివరాల ప్రకారం 2022, డిసెంబర్ 31 నాటికి భారత్?లోని జైళ్ల ఆక్యుపెన్సీ రేటు (ఖైదీల నిష్పత్తి) ఏకంగా 131 శాతంగా నమోదైంది. జైళ్ల సామర్థ్యానికి మించి కిక్కిరిసిపోవడం వల్ల మౌలిక సదుపాయాల కల్పన అదే రీతిలో ఉండట్లేదని, ఇది రోగుల వైద్య సంరక్షణ, వారి జీవన ప్రమాణాల్ని దారుణంగా దెబ్బతీస్తోందని నల్సా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం- ఖైదీల హక్కుల్ని కాపాడే దిశగా ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. వారి ముందస్తు విడుదలపై దేశవ్యాప్తంగా ఒకే విధమైన పాలసీ అవసరం అని కోర్టు స్పష్టం చేసింది.

అక్షర టైమ్స్

# హైదరాబాద్ స్కూల్‌లో వివాదం.. హిందూ విద్యార్థికి 'కల్మా' హోంవర్క్

**హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో హిందూ విద్యార్థికి ఇస్లామిక్ హోంవర్క్**

**ఆందోళన వ్యక్తం చేసిన విద్యార్థి తల్లిదండ్రులు.. టీచర్‌ను తొలగించిన యాజమాన్యం**

**ఇది పొరపాటున జరిగిందని.. అయినా చర్యలు తీసుకున్నామని స్కూల్ వివరణ**

**ఘటనపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం.. ప్రభుత్వంపై విమర్శలు**



హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తీవ్ర వివాదం చెలరేగింది. రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి ఇస్లామిక్ మతానికి సంబంధించిన సూరాలను హోంవర్క్‌గా ఇవ్వడం ఈ వివాదానికి కారణమైంది. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాఠశాల యాజమాన్యం స్పందించి, అందుకు బాధ్యురాలైన టీచర్‌ను ఉద్యోగం నుంచి తొలగించింది.వివరాల్లోకి వెళితే.. సైదాబాద్ ప్రాంతంలోని 'సక్సెస్' అనే ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థికి నిన్న 'దీనియాత్' సబ్జెక్టు కింద 'సూరా ఫాతిహా' చదవాలని స్కూల్ డైరీలో హోంవర్క్ రాశారు. అంతకుముందు ఈ నెల 11న 'కల్మా' చదవాలని రాసి, అది ముస్లిమేతర విద్యార్థి అని గ్రహించి టీచర్ దానిని కొట్టివేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని గమనించిన విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించి తీవ్ర నిరసన తెలిపారు. విద్యాసంస్థలో ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.తల్లిదండ్రుల నిరసనతో పాఠశాల యాజమాన్యం వెంటనే స్పందించింది. ఇది పొరపాటున జరిగినప్పటికీ, ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో 'సక్సెస్' విద్యాసంస్థల గ్రూపులో ఆమె ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోకుండా అనర్హురాలిగా ప్రకటించారు. తమ పాఠశాలలో ఎక్కువ మంది ముస్లిం విద్యార్థులు ఉన్నారని, వారికి 'దీనియాత్' (ఇస్లామిక్ బోధన) సబ్జెక్టు ఉంటుందని, అయితే ఆ సబ్జెక్టును ఇతర మతాల విద్యార్థులకు బోధించమని యాజమాన్యం వివరణ ఇచ్చింది.ఈ ఘటనపై ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా స్పందించారు. రెండో తరగతి విద్యార్థిపై 'కల్మా' చదవాలని పాఠశాల యాజమాన్యం ఒత్తిడి చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు. "తెలంగాణలో ఇలాంటి ఘటనలు కొత్తేమీ కాదు. గతంలోనూ చాలా జరిగాయి. హిందూ పిల్లాడిని కల్మా చదవాలని ఎలా ఒత్తిడి చేస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే, స్కూల్ యాజమాన్యం వద్ద సమాధానం లేదు," అని ఆయన పేర్కొన్నారు.హిందూ విద్యార్థులను బలవంతం చేస్తున్న ఇలాంటి పాఠశాలలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఎందుకు మౌనంగా ఉన్నారని రాజాసింగ్ ప్రశ్నించారు.

# సైబర్ బాధితులకు డబ్బు రీఫండ్ మరింత సులభతరం

**సైబర్ సెక్యూరిటీ బ్యూరో చెబుతున్న మార్గమిదే**

**సైబర్ మోసాల్లో కోల్పోయిన డబ్బును తిరిగి చెల్లించే ప్రక్రియ వేగవంతం**

**ఫిర్యాదు పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చిన మనీ రిస్టోరేషన్ మాడ్యూల్**

**ఇందులోనే బాధితులు వివరాలు పొందుపరచాలన్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో సంచాలకులు**

**సైబర్ బాధితులకు రీఫండ్ పోర్టల్**




సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బు పోగొట్టుకున్న బాధితులకు ఉపశమనం కలిగించేలా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ తరహా సైబర్ మోసాలకు గురైన బాధితులు వారి సొమ్మును తిరిగి పొందేందుకు ఏర్పాటు చేసిన నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)ను మరింత సులభతరం చేసినట్లు వివరించింది. ఇకపై సైబర్ నేరాలకు గురైన బాధితులు వారి అభ్యర్థనలను మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం)లోనే నమోదు చేసుకోవాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో సంచాలకులు శిఖా గోయల్ వెల్లడించారు. దీని ద్వారా బాధితులకు వేగంగా రీఫండ్ చేయొచ్చని తెలిపారు.ప్రస్తుతం చాలా మంది సైబర్ బాధితులు సకాలంలో ఎన్‌సీఆర్‌పీలో ఫిర్యాదు చేస్తున్నారు. దీని ద్వారా ఆ కాజేసిన సొమ్ము నేరగాళ్ల ఖాతాలో జమ కాకుండా ఇన్వెస్టిగేటివ్ అధికారులు దాదాపుగా అడ్డుకోగలుగుతున్నారు. అయితే, గతంలో ఇలా జప్తు చేసిన డబ్బును తిరిగి బాధితులకు చెల్లించే ప్రక్రియ న్యాయస్థానం ద్వారా జరిగేది. దీనికి చాలా సమయం పట్టేది. ఇందుకు పరిష్కారంగా ఎన్‌సీఆర్‌పీని తీసుకొచ్చారు. ఇప్పుడు ఈ పోర్టల్‌ను మరింత సులభతరం చేసేలా మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం)ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.సైబర్ బాధితులు పోర్టల్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత చేయాల్సిన ప్రక్రియ గురించి శిఖా గోయల్ వివరించారు. బాధితుల సొమ్ము నేరగాళ్ల ఖాతాల్లోకి చేరకుండా, ఆ లావాదేవీని నిలిపివేసిన (ఫ్రీజ్) సందర్భంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారుల నుంచి నోటిఫికేషన్ లేదా షార్ట్ మెసేజ్ వస్తుందని ఆమె తెలిపారు. ఇలా వచ్చిన బాధితులు ఎంఆర్ఎంలో మాత్రమే వారి వివరాలు పొందుపరచాలని ఆమె సూచించారు. దీనిపై మరిన్ని సందేహాలు నివృత్తి చేసుకోవాలనుకుంటే పరిధి పోలీస్ స్టేషన్‌నుగానీ లేదా కేసు దర్యాప్తు అధికారినిగానీ సంప్రదించాలన్నారు.సైబర్ క్రైమ్ సెక్యూరిటీలో హెల్ప్ డెస్క్ కోసం ఏర్పాటు చేసిన 8712665600 నంబర్‌ను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య సంప్రదించవచ్చని శిఖా గోయల్ వివరించారు. సైబర్ నేరానికి సంబంధించి బాధితులు ఫిర్యాదు చేసిన అనంతరం వారికి వచ్చే మెసేజ్‌లోని లింక్‌ను అనుసరించాలన్నారు. దాన్ని క్లిక్ చేసిన తర్వాత సంబంధిత మొబైల్ నంబర్‌తో లాగిన్ కావాలన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఓటీపీతో పాటు మిగతా వివరాలు పొందుపరచాలన్నారు. బ్యాంక్ అకౌంట్ వివరాలతో పాటు అవసరం మేరకు పాన్‌కార్డు నంబర్‌ను కూడా సమర్పించవలసి ఉంటుదని శిఖా గోయల్ స్పష్టం చేశారు.ఈ ప్రక్రియ ద్వారా పోగొట్టుకున్న డబ్బును బాధితుల ఖాతాల్లోకి వేగంగా తిరిగి జమ చేయడం (రీఫండ్) సాధ్యమవుతుందని శిఖా గోయల్ పేర్కొన్నారు. అయితే, కొందరు కేటుగాళ్లు ఇదే అదనుగా తీసుకొని డబ్బును త్వరగా రికవరీ చేయడంలో సహాయపడతామని చెప్పే అవకాశముందని ఆమె సూచించారు. ఇలా అపరిచితులు చెప్పే నమ్మొద్దని అనధికార వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా పంపించే ఎవరితోనూ ఓటీపీలను పంచుకోవద్దన్నారు. అలాగే పాస్‌వర్డ్‌లు లేదా బ్యాంకింగ్ వివరాలను ఇతరులకు వెల్లడించవద్దని ఆమె హెచ్చరించారు.సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఈ క్రమంలో ఈ తరహా మోసాల పట్ల అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరం. ఏదైనా కొత్తగా పాల్పడుతున్న సైబర్ మోసం గురించి కాస్త తెలుసుకున్నప్పుడు, దానిపై పూర్తిగా అవగాహన పెంచుకునేందుకు ప్రయత్నించాలి. దీని గురించి కుటుంబ సభ్యులకూ వివరించాలి. ఒకవేళ సైబర్ మోసానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930ను సంప్రదించాలి. లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లోనైనా ఫిర్యాదు చేయాలి.

# పంట పొలాల మధ్య నుంచి ముంబయికి

**శివారు గ్రామాల ప్రజల గుండెల్లో 'బుల్లెట్' గుబులు!**

**15 రోజులుగా బుల్లెట్ రైలు మార్గానికి మార్కింగ్**

**పంట పొలాల మధ్య నుంచే ముంబయికి**

**హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ మార్గమంతా వ్యవసాయ పొలాల మధ్యలో నుంచే**



హైదరాబాద్ నగర శివారుల్లోని శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయికి హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ మార్గానికి అడుగులు వేగంగా ముందుకు పడుతున్నాయి. ఇప్పటికే సంబంధిత అధికార యంత్రాంగం దీనికి సంబంధించి మార్కింగ్ పనులను చేస్తున్నారు. ప్రస్తుతం హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ మార్గమంతా వ్యవసాయ పొలాల మధ్యలో నుంచే వెళ్తుండటంతో అన్నదాతలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతున్న ఏడు బుల్లెట్ రైళ్లలో మూడు మార్గాలు తెలంగాణలోనే ఏర్పాటవుతున్నాయి. ఇదే విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించడంతో నగర శివారుల్లో బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి రానుందనే దానికి మరింత బలం చేకూరింది. దీనికితోడు శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని బహదూర్‌గూడ వద్ద బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం 600 ఎకరాల భూమిని కేటాయించింది. ఇక్కడినుంచే మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగానే శంషాబాద్-ముంబయి, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-అమరావతి-చెన్నై కారిడార్లు ఏర్పాటు కానున్నాయి.ఇందులో ముంబయి మార్గానికి సంబంధించి బహదూర్‌గూడ వద్ద మొదలై మొయినాబాద్, చేవెళ్ల, వికారాబాద్ మీదుగా కారిడార్‌ను నిర్మాణం చేస్తారు. పదిరోజులుగా దీనికి సంబంధించి రైల్వే యంత్రాంగం వేగంగా మార్కింగ్‌లు వేస్తున్నారు. శంషాబాద్ మండలంలోని చౌదరిగూడ, కేబీదొడ్డి, సుల్తాన్‌పల్లి గ్రామాలతో పాటు మొయినాబాద్ మండలంలోని సురంగల్, కేతిరెడ్డిపల్లి, అమ్డాపూర్ కూడళ్లల్లో మార్కింగ్‌లు వేశారు. ఎలాంటి మూలమలుపులు లేకుండా ప్రతి 5 కిలో మీటర్లకు ఒక చోట మార్కింగ్ వేస్తున్నారు. ఈ మార్కింగ్‌లు పచ్చటి పంట పొలాల మధ్య నుంచే వస్తుండటంతో రైతులు తమ భూములు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం మార్కింగ్ ఇస్తున్న బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని నాలుగు వరుసల్లో నిర్మిస్తారని తెలుస్తోంది. ఇందుకోసం సుమారుగా 300 అడుగుల వెడల్పుతో భూసేకరణ చేసే అవకాశం ఉంది. ఆయా మార్గాల్లో చిన్న, సన్నకారు రైతుల భూములే ఎక్కువగా ఉండటం సమస్య ఏర్పడటానికి కారణమవ్వొచ్చు. ఒకవేళ ఇదే కార్యరూపం దాలిస్తే భూములు కోల్పోయే రైతులకు ఎంత మేర పరిహారం అందుతుందనే దానిపై స్పష్టత లేదు. రెవెన్యూ అధికారులకు సైతం రైల్వేశాఖ నుంచి ఈ విషయంలో స్పష్టత లేదు. బుల్లెట్ ట్రైన్ మార్గానికి ఇరువైపులా సర్వీసు దారులను సైతం అందుబాటులోకి తెచ్చే అవకాశం కనిపిస్తోంది. శంషాబాద్ మండలం కేబీదొడ్డి గ్రామం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం కూడా ఉంది.

# కిర్లంపూడి పీఎస్‌లో అంబటి రాంబాబుపై కేసు నమోదు



కాకినాడ జిల్లా కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబుపై కేసు నమోదైంది. ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో పోలీసుల విధులకు ఆయన ఆటంకం కలిగించారు. గార్డ్ ఆఫ్ ఆనర్ ఇస్తుండగా అంబటి, అతని అనుచరులు పోలీసులను తోసేశారు. ఈ ఘటనపై ఏఆర్ ఎస్ఐ వెలుదూటి అప్పలరాజు, పలువురు కానిస్టేబుళ్లు కిర్లంపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ముందే ఉద్దేశపూర్వకంగా తోసేశారని, తమ విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంబటి రాంబాబు సహా మరికొందరిపై పలు సెక్షన్ల కింద కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు.మరోవైపు కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలు బుధవారం సాయంత్రం కాకినాడ జిల్లా కిర్లంపూడిలో పూర్తయ్యాయి. ఆయన కోరిక మేరకు ఇంటి ఆవరణలోనే ఖననం చేశారు. అంత్యక్రియలను అధికార లాంఛనాలతో చేపట్టాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. పోలీసులు అందుకు ఏర్పాట్లు చేయగా వైఎస్సార్సీపీ నేతలు అడ్డుకున్నారు.కొద్దిసేపు అధికార లాంఛనాల ప్రకారం కార్యక్రమం జరిగింది. గౌరవ వందనం సమయంలో రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు గణేష్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తర్వాత మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసులను బయటకు నెట్టేశారు. పెద్దాపురం డీఎస్పీ తిలక్ వారికి సర్దిచెప్పడానికి ప్రయత్నించినా వినిపించుకోకపోవడంతో అధికార లాంఛనాలను అర్ధాంతరంగా నిలిపేయాల్సి వచ్చింది. అనంతరం ముద్రగడ పార్థివదేహానికి ఆయన కుటుంబసభ్యులు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు.అంతకుముందు వైఎస్ జగన్, ముద్రగడ నివాసం వద్దకు చేరుకోగానే ఉద్రిక్తత చోటు చేసుకుంది. జనాలు నెట్టేసుకోవడంతో తోపులాటకు దారి తీసింది. దీంతో రోప్ పార్టీ బందోబస్తు కోసం వచ్చిన మహిళా హోంగార్డు రేణుక స్పృహతప్పి కిందపడిపోయారు. ఆమెను సిబ్బంది ఆసుపత్రికి తరలించారు.మరోవైపు అంతకుముందు ముద్రగడ పద్మనాభం భౌతికకాయానికి నివాళులర్పించడానికి ఆయన కుమార్తె, జనసేన నాయకురాలు క్రాంతి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ముందుగా ప్రత్తిపాడు వద్ద ఆమెను పద్మనాభం అనుచరులు, అభిమానులు అడ్డుకున్నారు. పోలీసులు బందోబస్తు మధ్య క్రాంతి కిర్లంపూడికి చేరుకొని ముద్రగడ పార్థివదేహం వద్దకు వెళ్తుండగా మరోసారి ఆయన అనుచరులు క్రాంతిని అడ్డుకున్నారు. క్రాంతి గో బ్యాక్ డోంట్ టచ్ అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం నెలకొంది.కన్నతండ్రికి చివరి వీడ్కోలు పలికేందుకు వెళ్లనివ్వరా అంటూ క్రాంతి బోరున విలపించారు. చేసేదేమీ లేక క్రాంతి తీవ్ర మనోవేదనతో దూరం నుంచే తండ్రిని చివరి చూపు చూసి వెళ్లిపోయారు. ఆమె సోదరుడు సైతం తండ్రిని చూపించడానికి నిరాకరించడంతో కాసేపు వారితో ఆమె వాదించింది. ఫలితం లేక పెద్దగా రోదిస్తూ వెనుతిరిగిన సమయంలో కుప్పకూలిపోయారు. అక్కడున్నవారు సపర్యలు చేసి పోలీసుల సాయంతో పంపించారు. తండ్రి అంత్యక్రియలను రాజమహేంద్రవరంలోని తన ఇంటి వద్ద టీవీలో చూస్తూ క్రాంతి బోరున విలపించారు.

# అలల ఉద్ధృతికి బోటు బోల్తా

**ప్రాణాలతో బయటపడిన ఏడుగురు మత్స్యకారులు**

**విశాఖ ఫిషింగ్ హార్బర్ సమీపంలో బోటు ప్రమాదం**

**ప్రమాదంలో సుమారు రూ.2.5 లక్షల విలువైన బోటు, రూ.2 లక్షల విలువ చేసే చేపల వల పూర్తిగా ధ్వంసం**



విశాఖ ఫిషింగ్ హార్బర్ పరిసరాల్లో వరుసగా చోటు చేసుకుంటున్న సముద్ర ప్రమాదాలు మత్స్యకార కుటుంబాల్లో తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. ఇటీవల సముద్రంలో ఆరుగురు జాలర్ల గల్లంతైన ఘటన మరువక ముందే తాజాగా హార్బర్ సమీపంలో మరో బోటు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు మత్స్యకారులు అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వరుస ప్రమాదాలు సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.గురువారం ఉదయం ఏడుగురు మత్స్యకారులు చేపల వేట కోసం బోటులో విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి బయలుదేరారు. హార్బర్ సమీపంలోనే సముద్రంలో అలలు ఒక్కసారిగా ఉద్ధృతంగా ఎగసిపడ్డాయి. భారీ అలల ధాటికి బోటు అదుపుతప్పి బోల్తాపడడంతో అందులో ఉన్న మత్స్యకారులు సముద్రంలో పడిపోయారు. అలల తాకిడి కారణంగా బోటు, మత్స్యకారులు పెద్ద పెద్ద రాళ్ల మధ్య ఇరుక్కుపోయారు. అయితే అప్రమత్తంగా వ్యవహరించిన జాలర్లు బోటును గట్టిగా పట్టుకుని ప్రాణాలను కాపాడుకున్నారు.ఈ ప్రమాదంలో తాతారావు, ఆకాష్ తీవ్రంగా గాయపడగా, వారిని వెంటనే విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంలో సుమారు రూ.2.5 లక్షల విలువైన బోటు, రూ.2 లక్షల విలువ చేసే చేపల వల పూర్తిగా ధ్వంసమయ్యాయి. గంగమ్మ తల్లి కటాక్షంతోనే తాము ప్రాణాలతో బయటపడ్డామని, నష్టపోయిన తమ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు.

# 'నా తమ్ముడి మృతిపై ఎలాంటి అనుమానం లేదు అందుకే ఆత్మహత్య చేసుకున్నాడు'

**షాబాద్ వరుస హత్యల కేసులో కీలక పరిణామం**

**రాజ్‌కుమార్ సోదరుడు భాస్కర్ ఫిర్యాదుతో కొత్తూరు ఠాణాలో కేసు నమోదు**

**పురుగుమందు తాగి చనిపోయాడని భాస్కర్ ఫిర్యాదు**



రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన షాబాద్ వరుస హత్యల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడు రాజ్‌కుమార్ (28) ఆత్మహత్య చేసుకున్నట్లు అతడి సోదరుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదుతో రంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆరు హత్యల అనంతరం పోలీసులు గాలిస్తున్నారని, ఎప్పటికైనా అరెస్టవడం ఖాయమనే భయంతోనే రాజ్‌కుమార్ పెంజర్ల గ్రామ శివారులో పురుగుమందు తాగి చనిపోయాడని భాస్కర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని, అతడి మరణంపై ఎలాంటి అనుమానం లేదని అందులో ప్రస్తావించారు. ఆరు హత్యలపై నమోదైన రెండు కేసుల్లో నిందితుడైన రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై, పోలీసులు దర్యాప్తు చేసి కోర్టులో నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.రాజకుమార్ సొంతూరు దైవాలగూడకు చెందిన సరితను 2018లో ప్రేమ వివాహం చేసుకున్నట్లు రాజ్‌కుమార్ సోదరుడు తెలిపారు. ఆ పెళ్లి తర్వాత ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా విపరీతంగా అప్పులపాలయ్యాడని చెప్పారు. వీటిని తీర్చేందుకు తన వాటాగా వచ్చే భూమి అమ్మేస్తానని తెలిపారు. కుటుంబ సభ్యులు నిరాకరించడంతో గతేడాది అక్టోబర్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడని చెప్పారు. ఆసుపత్రిలో చేర్పించగా ప్రాణాలతో బయటపడ్డాడని, ఆ తర్వాత ఇంటి పక్కనే ఉండే బాలికను వేధించగా, రెండు నెలల క్రితం షాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దాంతో పరారైన రాజ్‌కుమార్ పెంజర్లలో వారం రోజులు ఉన్నాడని అతని సోదరుడు తెలిపారు.ఇలా ఈ కేసు పెట్టినందుకు బాలికపై కక్షపెట్టుకుని వింతగా ప్రవర్తించేవాడని తెలిపారు. ఇంటి పక్కనే ఉండే బాలిక, ఆమె తల్లి, నానమ్మతో పాటు భార్య సరిత, ఇద్దరు పిల్లల్ని రాజ్‌కుమార్ హతమార్చాడంటూ ఈ నెల 10న రాత్రి తన తండ్రి ఫోన్ చేసి చెప్పారన్నారు. ఎక్కడికైనా వెళ్లి చనిపోతానని చెప్పి, అనంతరం కారులో పారిపోయాడని తెలిపారు. ఈ హత్య కేసు విషయంలో 13వ తేదీన తనను షాబాద్ పోలీసులు విచారిస్తుండగా, పెంజర్లలో గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు కొత్తూరు ఇన్‌స్పెక్టర్ ద్వారా తెలిసిందన్నారు. మృతదేహం రాజ్‌కుమార్‌దేనని గుర్తించారు. అక్కడ పక్కనే పురుగుల మందు డబ్బా తెరిచి ఉందని రాజ్‌కుమార్ సోదరుడు భాస్కర్ తెలిపారు.రాజ్‌కుమార్ మృతదేహానికి చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రాత్రి పోస్టుమార్టం నిర్వహించారు. ఇంతకు ముందు డ్యూటీలో ఉన్న డాక్టర్ ముందుకు రాకపోవడంతో మూడు గంటల పాటు పోలీసులు ఎదురుచూడాల్సి వచ్చింది. వికారాబాద్ జిల్లా ఆసుపత్రి నుంచి వైద్యులను రప్పించడానికి ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో చేవెళ్ల ఆసుపత్రికి చెందిన వైద్యులు లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రణీత్‌ను పిలిపించారు. ఎట్టకేలకు ఆ రాత్రి 9.30 తర్వాత పోస్టుమార్టం ప్రక్రియ ప్రారంభించారు. రాజ్‌కుమార్ మృతదేహాన్ని తీసుకెళ్లడానికి కుటుంబసభ్యులు నిరాకరించడంతో పోలీసులు చేవెళ్ల మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.మరోవైపు బాధిత కుటుంబంలోని దివ్యాంగురాలికి అన్ని రకాలుగా అండగా ఉంటామని కలెక్టర్ నారాయణరెడ్డి, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల చెక్కును బాలికకు అందజేశారు. ఇందిరమ్మ ఇంటితో పాటు ఆమె సంరక్షణ కోసం పునరావాస కేంద్రంలో చేర్పిస్తామని తెలిపారు. తండ్రి సర్కారు ఉద్యోగి అయినందున ఆయనకు వచ్చే పింఛన్‌ని ఆమెకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# గుడ్డు ధర ఆల్ టైమ్ రికార్డ్.. కారణాలివే!



నిత్యావసరాల ధరలతో సతమతమ వుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మరో షాక్ తగిలింది. మాంసాహారానికి చౌకైన ప్రత్యామ్నాయంగా భావించే కోడిగుడ్డు ధర చరిత్రలో ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరింది. తూర్పుగోదావరి జిల్లాలోని ఫామ్‌గేట్ వద్దే గుడ్డు ధర రూ. 6.95 పలకడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో బహిరంగ మార్కెట్‌లో ఒక్కో గుడ్డును రూ. 8.50కు పైగా అమ్ముతున్నారు. ఈ రేట్లు చూసి వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.ఏపీలో కోడిగుడ్ల ఉత్పత్తికి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా ఉంది. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకే కాకుండా పొరుగు రాష్ట్రాలకు, విదేశాలకు సైతం గుడ్లు ఎగుమతి అవుతుంటాయి. సాధారణంగా ఇక్కడ 1.3 కోట్ల కోళ్లు ఉండగా, రోజుకు కోటి వరకు గుడ్ల ఉత్పత్తి జరుగుతుంది. అయితే, ఈ ఏడాది రికార్డు స్థాయిలో నమోదైన ఎండల తీవ్రత కోళ్ల పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపింది. వేడిని తట్టుకోలేక అధికారిక లెక్కల ప్రకారం 16.35 లక్షల కోళ్లు మృతి చెందగా, అనధికారికంగా ఈ సంఖ్య 20 లక్షలకు పైనే ఉంటుందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు, బతికి ఉన్న కోళ్లు కూడా వేసవి ప్రభావంతో గుడ్ల ఉత్పత్తిని తగ్గించాయి. దీంతో మార్కెట్‌లో తీవ్రమైన గుడ్ల కొరత ఏర్పడింది.గతేడాది ఇదే సమయానికి ఫామ్‌గేట్ వద్ద గుడ్డు ధర రూ. 4.94గా ఉండగా, ఇప్పుడు ఏకంగా రూ. 6.95కి చేరడం గమనార్హం. ఉత్పత్తి తగ్గడం ఒక కారణమైతే, విపరీతంగా పెరిగిన దాణా ధరలు మరో ప్రధాన కారణమని రైతులు చెబుతున్నారు. టన్ను సోయా ధర రూ. 40 వేల నుంచి రూ. 65 వేలకు, నూనె తీసిన తవుడు ధర రూ. 12 వేల నుంచి రూ. 22 వేలకు పెరిగిందని, మొక్కజొన్న ధరలు కూడా పెరగడంతో నిర్వహణ భారం మోయలేనిదిగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు పెరిగిన పెట్టుబడితో రైతులు, మరోవైపు ఆకాశాన్నంటిన ధరలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు గుడ్డు, ఇటు కిలో రూ. 300 దాటిన చికెన్ ధరలతో సామాన్యుడికి ఏం కొనాలో, ఏం తినాలో పాలుపోని పరిస్థితి నెలకొంది.

# ధ్యానంతో దంపతుల మధ్య అనుబంధం!

రోజుకు 10 నిమిషాల పాటు ఇలా చేయండి!

దంపతుల మధ్య హెల్దీ బాండింగ్ కోసం

సింపుల్ టిప్స్ సూచిస్తున్న నిపుణులు!



వ్యాయామాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని అందరికి తెలిసిందే. అలాగే, భావోద్వేగాల్ని అదుపులో ఉంచుతాయి. అయితే, ఇవే వ్యాయామాలు అనుబంధాల్నీ దృఢం చేస్తాయంటున్నారు నిపుణులు. ముఖ్యంగా, ధ్యానం పాజిటివ్ ఆలోచనల్ని రేకెత్తించి, ఎదుటి వ్యక్తిని సానుకూల దృక్పథంతో చూసేలా ప్రేరేపిస్తుందని చెబుతున్నారు. దంపతులిద్దరూ కలిసి ధ్యానం చేసినా, విడివిడిగా చేసినా, ఇది ఇద్దరి మధ్య అనుబంధాన్ని దృఢం చేస్తుందని పేర్కొంటున్నారు.ఆఫీస్ లేదా ఇతర పనుల వల్ల ఒత్తిడి, ఆందోళన సర్వసాధారణం. దీన్ని చాలామంది భాగస్వామిపై చూపిస్తూ ఉంటారు. అయితే, రోజూ ధ్యానం చేయడం వల్ల ఆందోళన, ఒత్తిడి తగ్గిపోతుంది. అలాగే, చిన్న చిన్న విషయాలకే కోపతాపాలకు గురికావడం తగ్గుతుంది. దీంతో ఏ విషయం గురించి అయినా ప్రశాంతంగా ఆలోచించగలుగుతారు. ఈ ప్రశాంతతే భార్యాభర్తలిద్దరి మధ్య ఎలాంటి గొడవలు రాకుండా, ఒకవేళ వచ్చినా వాటిని తగిన పరిష్కార మార్గాలు వెతుక్కునే నేర్పును అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు.మనసులోని ప్రతికూల ఆలోచనల్ని దూరం చేయడంలో ధ్యానం కీలక పాత్ర పోషిస్తుందంటున్నారు నిపుణులు. దీనివల్ల పాజిటివిటీని అలవర్చుకోవచ్చట. ఇలా ప్రతిదీ సానుకూల దృక్పథంతో చూడగలుతాం. అంతేకాదు, భాగస్వామి కోణంలో నుంచి పరిస్థితిని అర్థం చేసుకునే సహనం పెరుగుతుంది. వారి మాటలు, భావాల్నీ అర్థం చేసుకోగలుగుతాం. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య పెరిగిన దూరాన్ని దగ్గర చేసుకోవాలంటే ఇదీ ముఖ్యమే.మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు ఇతరులతో సులభంగా కలిసిపోతాం. తద్వారా ఇటు మన మనసులో ఉన్న సమస్యలు, బాధల్ని వారితో పంచుకుంటాం. అలాగే, భాగస్వామి చెప్పేది మధ్యలో అడ్డుపడకుండా, పూర్తిగా వినే ఓపిక పెరుగుతుంది. ఇలా ఇద్దరి మధ్య ఎలాంటి దాపరికాల్లేనప్పుడు అనుబంధంలోనూ ఎలాంటి కలతలు ఉండవని నిపుణులు చెబుతున్నారు.కొన్నిసార్లు దంపతులిద్దరిలో ఎవరికి కోపం వచ్చినా, అవతలి వారు మాట పడరు. దీనివల్ల గొడవ పెద్దదవడం తప్ప మరే ప్రయోజనం ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటప్పుడు ఓపికతో వ్యవహరించాలన్నా, భరించే శక్తిని పెంచుకోవాలన్నా ధ్యానం తప్పనిసరని పేర్కొంటున్నారు.క్షమాగుణాన్ని పెంచడంలోనూ ధ్యాన్యం తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. పొరపాటు మీరు చేసినా, అవతలి వారు చేసినా, క్షమాపణ కోరడం, క్షమించగలగడం అలవాటు చేసుకుంటే, బంధం బ్యాలన్స్‌డ్‌గా ముందుకు సాగుతుందట. ఈ క్రమంలో రోజుకు కేవలం 10 నుంచి 15 నిమిషాలు కలిసి ధ్యానం చేయడానికి కేటాయించాలని సూచిస్తున్నారు.

# "ప్రతిసారీ నాకే ఎందుకిలా జరుగుతోంది"

మనసును వేధించే 'రుమినేషన్'

రుమినేషన్ అంటే ఏమిటి

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసా



రాత్రి రెండవుతోంది. శరీరం అలసిపోయింది. కానీ, మనసు మాత్రం నిద్రపోనీయకుండా ఒకటే అలజడి, ఆందోళన. గతంలో జరిగిన సంఘటనే మళ్లీ మళ్లీ గుర్తుకొస్తోంది. అప్పుడు 'నేనలా మాట్లాడకుండా ఉండాల్సింది', 'వాళ్లు నా గురించి ఏమనుకున్నారో', 'ఎందుకు ప్రతిసారి నా విషయంలో ఇలా జరుగుతుంది' అని చాలామంది అనుకుంటున్నారు. ఇలా ఒకే విషయం లేదా సంఘటన గురించి అదే పనిగా ఆలోచిస్తూ ఉండటాన్ని సైకాలజీలో 'రుమినేషన్' అంటారు. ఈ క్రమంలో రుమినేషన్ అంటే ఏమిటి దీనివల్ల ఎలాంటి మానసిక సమస్యలు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం!మనలో చాలామంది ఒక విషయం లేదా సంఘటనను అప్పటి వరకు మాత్రమే గుర్తుపెట్టుకుంటారు. కానీ, కొంతమంది మాత్రం ఆ విషయం గురించి మళ్లీ మళ్లీ ఆలోచిస్తుంటారు. ఎలాగంటే, జంతువులు ఆహారాన్ని నెమరేసినట్లు, గత జరిగిపోయిన విషయాన్ని పదేపదే గుర్తుకు తెచ్చుకోవడం అన్నమాట. ఇలా ఆలోచించడాన్ని రుమినేషన్ అంటారు. ఇది వారికి తెలియకుండానే అలవాటుగా మారిపోతుంది. పైకి చూడడానికి ప్రశాంతంగా కనిపించినప్పటికీ, లోపం మాత్రం మైండ్ ఒకే సీన్‌ను రిపీట్ మోడ్‌లో ప్లే చేస్తూనే ఉంటుంది. గతంలో ఎదురైన ఒక తిరస్కరణ, ఓటమి, జరిగిపోయిన పొరపాటు, ఎవరో చెప్పిన మాట, అవమానం ఇలా ఏదో ఒకటి మనసులో తిష్ఠ వేసుకుని దానికి సంబంధించిన ఆలోచనలే గిర్రున తిరుగుతుంటాయి.రుమినేషన్‌కి చదువు, మాటతీరు, స్నేహితులు, పెద్దలతోనో అభిప్రాయ భేదాలు కారణం ఏదైనా కావచ్చు. ఈ రోజుల్లో సోషల్ మీడియా కూడా రుమినేషన్‌కి ఒక కారణమవుతుందంటున్నారు నిపుణులు. 'ఫలానా వాళ్లు ఫేస్‌బుక్‌లో అలా ఎందుకు పోస్ట్ పెట్టారు, ఆ పోస్టు దగ్గర కామెంట్ పెట్టకుండా ఉండాల్సింది', 'వాళ్లెందుకు నా పోస్టును లైక్ చేయడం లేదు' ఇలా ఏదో ఒక విషయం మనసులో నస పెడుతూనే ఉంటుంది.ఈ రుమినేషన్ ఎక్కువైతే ఒత్తిడి పెరుగుతుందంటున్నారు నిపుణులు. తద్వారా నిద్రలేమి, పనుల మీద ఏకాగ్రత తగ్గుతుందట. ఇది ఇలాగే కొనసాగితే దీర్ఘకాలంలో యాంగ్జయిటీ, డిప్రెషన్ ఆత్మన్యూనత లాంటి సమస్యలకు దారితీస్తుంది. ఈ క్రమంలో ఆలోచించడం తప్పు కాదు, అతిగా ఆలోచించడం, సరైన మార్గంలో ఆలోచించాలి.రుమినేషన్‌ని తగ్గించుకోవడం మన చేతిల్లోనే ఉంటుందట. ప్రతి విషయాన్నీ అతిగా ఆలోచించవద్దని నిపుణులు చెబుతున్నారు. జరిగిపోయిన దాన్ని ఎలాగో మార్చలేం కాబట్టి వదిలేయాలని గట్టిగా మనసుకు సర్దిచెప్పుకోవాలి. ఆ ఆలోచనను పుస్తకం లేదా పేపర్ మీద పెట్టడం కూడా కొంత వరకు వదిలించుకోవడానికి తోడ్పడుతుంది. అలాగే, వ్యాయామం చేయడం, ఏదైనా పెద్ద పని కల్పించుకోవడం లాంటివి మనసును వర్తమానంలోకి తెస్తాయి. లేకపోతే కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకున్నా దాని ప్రభావం తగ్గుతుంది. ముఖ్యంగా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటివి లైట్ తీసుకోవాలి. ప్రతి సమస్యకి పరిష్కారం, ముగింపు ఉండవు. కొన్నింటిని కాలానికే వదిలేయాలని నిపుణులు సూచిస్తున్నారు.




# రక్తహీనత సమస్య ఉందా వీటిని తింటే రక్తం ఎక్కువగా తయారవుతుంది

ప్రస్తుతం చాలా మంది రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అయితే రక్తహీనత వచ్చేందుకు పోషకాహార లోపమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. పోషకాలు లేని ఆహారాన్ని తింటున్నందునే చాలా మందిలో రక్తం తగినంతగా ఉండడం లేదని వారు అంటున్నారు. ముఖ్యంగా ఐరన్ లోపం సమస్య చాలా మందికి వస్తోంది. అలాగే ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరం అయ్యే విటమిన్ బి12 కూడా చాలా మందిలో లోపిస్తోంది. ఇది కూడా రక్తహీనతకు కారణం అవుతోంది. ఈ క్రమంలోనే కేవలం ఐరన్ మాత్రమే కాకుండా విటమిన్ బి12 ఉండే ఆహారాలను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇక రక్తహీనత తగ్గాలంటే తీసుకోవాల్సిన ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.



**జున్ను, బ్రౌన్ రైస్..**

జున్ను నుంచి మనకు విటమిన్ బి12 పుష్కలంగా లభిస్తుంది. కనుక జున్ను పాలు లభించే అసలు విడిచిపెట్టకుండా తీసుకోండి. జున్నును విటమిన్ బి12కు గొప్ప వనరుగా చెప్పవచ్చు. అదేవిధంగా పాలు, పనీర్‌తోపాటు ఇతర పాల ఉత్పత్తుల్లోనూ విటమిన్ బి12 అధికంగానే ఉంటుంది. ఇది మన శరీరంలో ఎర్ర రక్త కణాలు తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అలాగే బ్రౌన్ రైస్‌ను ఎక్కువగా తినాలి. బ్రౌన్ రైస్‌లోనూ మనకు విటమిన్ బి12 సమృద్ధిగానే లభిస్తుంది. ప్రస్తుతం చాలా మంది తెల్ల అన్నాన్ని ఎక్కువగా తింటున్నారు. దీన్ని తినడం వల్ల బరువు పెరగడంతోపాటు డయాబెటిస్ బారిన కూడా పడుతున్నారు. కనుక బ్రౌన్ రైస్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇందులో ఉండే విటమిన్ బి12 రక్తం తయారయ్యేందుకు దోహదపడుతుంది. అలాగే పలు ఇతర పోషకాలు కూడా మనకు లభిస్తాయి.

**పాలకూర జ్యూస్..**

రక్తహీనత అధికంగా ఉన్నవారు రోజూ పాలకూరతో జ్యూస్ తయారు చేసి 30 ఎంఎల్ మోతాదులో సేవిస్తుంటే కచ్చితంగా ఫలితం ఉంటుంది. పాలకూర ద్వారా ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తకణాలు తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అదేవిధంగా బీట్‌రూట్ జ్యూస్‌ను రోజూ ఒక కప్పు మోతాదులో తాగుతున్నా కూడా రక్తహీనత నుంచి బయట పడవచ్చు. బీట్‌రూట్‌లో బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉంటుంది. అలాగే దీని ద్వారా ఐరన్ కూడా మనకు ఎక్కువగానే లభిస్తుంది. కనుక బీట్‌రూట్ జ్యూస్‌ను తాగుతుంటే రక్తం అధికంగా తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు.

**దానిమ్మ పండ్లు..**

దానిమ్మ పండ్లను కూడా ఆహారంలో భాగం చేసుకోవాలి. రోజూ ఈ పండ్లను తింటే రక్తం అధికంగా తయారవుతుంది. లేదా ఈ పండ్ల జ్యూస్‌ను అయినా సరే రోజుకు ఒక కప్పు మోతాదులో తాగుతుండాలి. ఈ పండ్లను తినడం వల్ల శరీరంలో రక్త సరఫరా సైతం మెరుగు పడుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే రోజూ గుప్పెడు కరివేపాకులను దంచి ఆ మిశ్రమాన్ని మజ్జిగలో కలిపి తీసుకుంటుండాలి. దీంతో రక్తాన్ని పెంచుకోవచ్చు. రక్తహీనత తగ్గుతుంది. రక్తం తయారయ్యేలా చేసేందుకు గాను తోటకూర కూడా ఎంతగానో పనిచేస్తుంది. తోటకూరతో జ్యూస్ తయారు చేసి రోజూ తాగవచ్చు. లేదా తోటకూరను కూరగా వండుకుని తింటుండాలి. దీంతో రక్తం తయారవుతుంది. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల విటమిన్ బి12 ఇంకా ఐరన్‌ను పొందవచ్చు. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడతారు.

# తాటిబెల్లంలో ఉండే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు రోజూ తినాల్సిందే



మన చుట్టూ ఉండే ప్రకృతిలో ఎన్నో ఆరోగ్యకరమైన ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. కానీ చాలా మంది మాత్రం రోజూ అనారోగ్యకరమైన ఆహారాలనే తింటున్నారు. బేకరీ పదార్థాలు, జంక్ ఫుడ్, నూనె పదార్థాలు, స్వీట్లను ఎక్కువగా తింటున్నారు. దీని వల్ల రోగాల బారిన పడుతున్నారు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాలను రోజూ తింటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ఎలాంటి రోగాలు రాకుండా చూసుకోవచ్చు. ఇక ప్రకృతి మనకు అందిస్తున్న ఆరోగ్యకరమైన ఆహారాల్లో తాటి బెల్లం కూడా ఒకటి. దీన్ని మనం రహదారుల పక్కన చూడవచ్చు. చాలా మంది తాటిబెల్లాన్ని విక్రయిస్తుంటారు. అయితే తాటి బెల్లంను అది ఉన్న రంగు కారణంగా చాలా మంది ఇష్ట పడరు. కానీ ఇది అందించే ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే తాటి బెల్లంను ఇప్పుడే తినడం మొదలు పెడతారు. అన్ని ఆరోగ్య ప్రయోజనాలను ఇది అందిస్తుంది.

**రక్తహీనతకు ఔషధం..**

తాటిబెల్లంలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. దీంతో రక్తం ఎక్కువగా తయారవుతుంది. రక్తహీనత సమస్య ఉన్నవారికి తాటిబెల్లం చక్కని ఆప్షన్ అని చెప్పవచ్చు. రోజువారి ఆహారంలో తాటిబెల్లాన్ని తింటుంటే రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అలాగే ఇందులో మెగ్నిషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ముఖ్యంగా నరాల బలహీనత తగ్గుతుంది. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు తాటిబెల్లంను ఆహారంలో భాగం చేసుకుంటే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. దీంతో కండరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. కండరాలు పట్టుకుపోకుండా చూసుకోవచ్చు.

**ఎముకల ఆరోగ్యానికి..**

తాటిబెల్లంలో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో ఎముకలు బలంగా మారుతాయి. తాటిబెల్లంలో పొటాషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలోకి వస్తుంది. కనుక హైబీపీ ఉన్నవారికి తాటిబెల్లం ఒక వరం అనే చెప్పవచ్చు. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. తాటిబెల్లాన్ని మహిళలు తినడం వల్ల నెలసరి సమయంలో వచ్చే సమస్యలను తగ్గించుకోవచ్చు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తాన్ని శుద్ధి చేస్తాయి. శరీరంలో దెబ్బ తిన్న కణజాలానికి మరమ్మత్తులు చేస్తాయి. దీంతో స్త్రీలలో వచ్చే సమస్యలు తగ్గుతాయి.

**జీర్ణ సమస్యలకు..**

తాటిబెల్లంలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది మలబద్ధకం, అజీర్తి సమస్యలను తగ్గిస్తుంది. శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపుతుంది. క్యాన్సర్ కారకాలతో పోరాడి క్యాన్సర్‌ను నివారించే గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. అలాగే తాటిబెల్లంను తింటే పొడి దగ్గు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. రోజూ ఒక టీస్పూన్ తాటిబెల్లం తినడం వల్ల మైగ్రెయిన్ నుంచి ఉపశమనం పొందవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. అధిక బరువును తగ్గించేందుకు ఈ బెల్లం ఎంతగానో పనిచేస్తుందని డాక్టర్లు సైతం చెబుతున్నారు. కనుక తాటి బెల్లం మీకు కనిపిస్తే విడిచిపెట్టకుండా కొని తెచ్చి వాడండి. అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# ఉన్నది ఒకటే జిందగీ

సంపాదించడం తెలిసినవాళ్లకు ఖర్చు చేయడంపై కూడా అవగాహన ఉండాలి. లేకపోతే ఆదాయం పేరుకుపోతుంది కానీ, ఆనందం మీకు చిక్కకుండా ఎక్కడో కూరుకుపోతుంది! పొదుపు చేసిన సొమ్ము, మదుపు చేసిన మొత్తం మీ ముందుతరాలకు ఇచ్చేస్తే.. మీ తలరాతకు పరులు కూడా జాలిపడే పరిస్థితి వస్తుంది. జీవిత చరమాంకంలో అయినా, ఖుషీ చేయకపోతే ఎలా ఉన్నది ఒక్కటే జిందగీ! మీ లైఫ్ సుఖాంతం కావాలంటే.. సంపాదించింది ప్లాన్డ్‌గా ఖర్చు చేయడమే మార్గం! ప్రతి మనిషి జీవితం గందరగోళంగానే మొదలవుతుంది. తల్లి కడుపు నుంచి బయటపడగానే ఏడ్చేస్తాం. అది ప్రకృతి ధర్మం కాబట్టి%ొ% తెలియకపోయినా పాటిస్తాం. ఆకలి కాగానే తల్లిపాలు తాగుతాం. అది సృష్టివింత కాబట్టి.. తెలియకుండానే చేసేస్తాం. పెరిగి పెద్దయ్యేకొద్దీ మనలో ఆలోచనలు మొదలవుతాయి. చేయాల్సింది చేయకుండా ఉండటానికి ప్రయత్నిస్తాం. చేయకూడనివి చేయాలని తాపత్రయపడతాం. అలా తప్పుల మీద తప్పులు చేస్తూ పెరిగి పెద్దవుతాం. ఏళ్లొచ్చాక ఎక్కడ తప్పు చేసినా చెల్లుతుందేమో కానీ, ఆర్థిక విషయాల్లో పొరపాట్లకు తావిస్తే, జీవితం గ్రహపాటుగా మిగిలిపోతుంది. సంపాదించడం చేతకాని వాళ్లు తప్పు చేసే ఆస్కారం ఉండదు. దురదృష్టాన్ని నిందించుకుంటూ, ఇతరుల అదృష్టంపై ఏడుస్తూ భారంగా కాలం వెళ్లదీస్తుంటారు. వీళ్లను బాగు చేయడం ఎవరి తరమూ కాదు! కానీ, బాధ్యతగా బతుకుతూ, కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ, కష్టాలకు ఎదురొడ్డి నిలబడి ఒకస్థాయికి చేరుకుంటారు కొందరు. ఈ క్రమంలో కోరికలు చంపుకుంటారు, కష్టాలకు ఎదురీదుతారు, రూపాయి రూపాయి పోగు చేసి సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకుంటారు. జీవితం అంతా కుటుంబం కోసం పనిచేసిన ఈ వ్యక్తులు.. తమకంటూ ఓ లైఫ్ ఉందని అర్థం చేసుకోరు. అలా అర్థం చేసుకున్నవాళ్లు.. ఇదిగో ఈ పార్థసారథి గారిలా జిందగీని ముచ్చటగా ఎంజాయ్ చేస్తారు.



అందుకు ఆయనేం కోట్లు ఖర్చు చేయలేదు. ఒక్కటంటే ఒక్క కోటి రూపాయలు పదిలం చేశాడు. పార్థసారథి ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసేవాడు. పిల్లలను బాగా చదివించాడు. సర్వీసులో ఉన్నప్పుడే పిల్లల పెళ్లిళ్లూ అయిపోయాయి. కొడుకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. కూతురు, అల్లుడూ బ్యాంకులో పనిచేస్తారు. రెండేండ్ల కిందట రిటైర్ అయ్యాడు. శేష జీవితం మనవలు, మనవరాళ్లతో ఎంజాయ్ చేయాలని ఫిక్సయ్యాడు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అన్నీ కలిపితే రూ.కోటి దాకా వచ్చాయి. ఈ మొత్తాన్ని ఏం చేయాలో పార్థసారథికి అర్థం కాలేదు. అప్పటికే ఇల్లు ఉంది. ఒకటి రెండు ఆస్తులున్నాయి. పిల్లలకు తండ్రి సొమ్ము కావాలన్న ఆశ లేదు. 'ఈ కోటి ఏం చేయాలంటూ' నా సలహా అడిగారు. జీవితం అంతా కష్టపడిన ఆయన్ను 'ఈ కోటి రూపాయలు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారా' అని అడిగాను. ముందు కంగారుగా చూసినా.. తర్వాత తేరుకొని 'ఓ ఎస్' అన్నారు. ఈ కోటి రూపాయలను కరిగించకుండా.. జీవితాన్ని ఎంజాయ్ చేసే మార్గం ఉందని చెప్పడంతో.. ఆశ్చర్యంగా చూశారు. ఆ కోటి రూపాయలూ హైబ్రిడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయమని చెప్పాను. ఏటా మే 1వ తేదీన ఆ కోటిపై వచ్చే రిటర్న్స్ మొత్తాన్నీ రూపాయి మిగల్చకుండా విత్‌డ్రా చేసి, ఖర్చు చేయాలనే షరతును ఆయన అంగీకరించారు. అలా ఏడాది (2023-24) తిరిగే సరికి ఆ కోటి రూపాయలపై అచ్చంగా రూ.30 లక్షల రిటర్న్స్ వచ్చింది (మ్యూచువల్ ఫండ్స్ మార్కెట్ ఒడుదొడుకులకు లోబడి ఉంటాయి. అన్నిసార్లూ ఇలా రూ.30 లక్షలు వస్తాయన్న గ్యారెంటీ లేదు. కొన్నిసార్లు తక్కువ రావొచ్చు, అసలేం రాకపోవచ్చు కూడా! అయినా ఈ సొమ్ము వెకేషన్ నిమిత్తం కాబట్టి రాకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే దీని మీద ఆధారపడి లేరు కదా!). అంత పెద్ద అమౌంట్‌ను ఏం చేయాలని మళ్లీ అడిగారు. ఫ్యామిలీతో ఇంటర్నేషనల్ వెకేషన్‌కి వెళ్లమని చెప్పాను. కుటుంబంతో పదిరోజులు రెండు దేశాలు చుట్టొచ్చారు పార్థసారథి. అప్పటికీ రూ.30 లక్షల్లో సగమే ఖర్చయ్యాయి. 'దీన్ని ఏం చేయమంటారు' అని మళ్లీ సలహా కోరారు. 'కొడుకు, కోడలు, కూతురు, అల్లుడిని పిల్లలతో సహా డిన్నర్‌కు పిలిచి, ఇకపై నేను ఉన్నంత వరకు మీ పిల్లల చదువు ఖర్చు ఎంతైనా బాధ్యత నాదేనని' చెప్పమన్నాను! మార్కెట్ క్రాష్ అయినా, దీర్ఘకాలంలో మీ పెట్టుబడి పదిలంగా ఉంటుంది. రిటర్న్స్‌లో కొంత కోత పడుతుందేమో అంతే! తన పూర్తి పరివారంతో ఏడాదికి ఒక దేశం చుట్టేస్తూ జాయ్‌ఫుల్‌గా లైఫ్ ఎంజాయ్ చేస్తున్నారు పార్థసారథి. మనవలు, మనవరాళ్లనూ చదివిస్తూ మలిసంధ్యలో భారం అనుకోకుండా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అందరికీ ఇంత ఈజీగా సొల్యూషన్ దొరక్కపోవచ్చు. కానీ, విదేశాల్లో 'డై విత్ జీరో' కాన్సెప్ట్ ఎప్పట్నుంచో ఉంది. పోయేలోపు ఉన్నదంతా ఖర్చు చేసి లైఫ్ ఎంజాయ్ చేయడమన్నమాట. అలాగని జల్సాలకే ఖర్చు పెట్టాలన్న నియమం లేదు. నలుగురికీ సాయం చేయొచ్చు. పదిమంది ఆకలి తీర్చొచ్చు. ఇలా మీ కష్టార్జితం మీ ఇష్టం వచ్చినట్టు వెచ్చించడం అన్నమాట! పార్థసారథి కూడా ఈ సూత్రాన్నే ఎంచుకున్నారు. వారసులకు ఇవ్వాల్సింది ఆస్తుల మూటలు కాదు. మంచి భవిష్యత్తు. బుద్ధిమంతులు ఏ ఆస్తీ ఇవ్వకున్నా.. హాయిగా బతికేస్తారు. బుద్ధిహీనులకు ఏడు తరాలకు సరిపడా ఆస్తి ఇచ్చినా ఊడ్చిపడేస్తారు. సో, మీ కష్టార్జితాన్ని ఎలా వినియోగిస్తారో ఇక మీ ఇష్టం!!

అక్షర టైమ్స్

# హైదరాబాద్‌లో పేదలకు లక్ష ఇళ్లు తెలంగాణ సర్కారు కీలక నిర్ణయం



ఇందిరమ్మ హౌసింగ్ స్కీమ్ వివరాలివిగో.. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో నివసిస్తున్న పేదలకు సైతం గృహ భద్రత కల్పించే ఉద్దేశంతో ప్రతిష్టాత్మక ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని మరింత విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. నిరాశ్రయులకు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు శాశ్వత గృహ వసతి కల్పించడమే లక్ష్యంగా సాగుతున్న ఈ సంక్షేమ కార్యక్రమం.. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాగా, ఇప్పుడు సరికొత్త వ్యూహాత్మక మార్పుతో హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోకి అడుగుపెట్టింది. ఈ నూతన ప్రణాళిక కింద నగర పరిధిలోని అల్ప ఆదాయ వర్గాల కోసం దశలవారీగా ఒక లక్ష ఇళ్లను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తూ.. ఉపాధి పొందుతున్న ప్రాంతాలకు వీలైనంత సమీపంలోనే ఈ సరసమైన గృహాలను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ పట్టణ ఇందిరమ్మ గృహాల నిర్మాణ ప్రక్రియను జూలై 20న లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆ తదనంతరమే లబ్ధిదారుల అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం, టెండరింగ్, నిర్మాణ మార్గదర్శకాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం అధికారికంగా విడుదల చేస్తుంది. నగరంలో నిరంతరం పెరుగుతున్న గృహాల వ్యయాలతో.. అద్దెలతో సతమతమవుతున్న వేలాది పేద కుటుంబాలకు ఈ పథకం పెద్ద ఊరటనివ్వనుంది. ఈ గృహాల నిర్మాణాన్ని 2026-27 ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా తొలుత చేపట్టే పైలట్ దశలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం 500 ఇళ్లను నిర్మిస్తారు. అయితే, స్థానికంగా ఉన్న డిమాండ్, ప్రభుత్వ భూమి లభ్యతను బట్టి కొన్ని నియోజకవర్గాలలో ఈ సంఖ్యను 1,000 ఇళ్ల వరకు పెంచే అవకాశం కూడా ఉంది. హైదరాబాద్‌లో ఈ ఏరియాలో లగ్జరీ హౌస్ కోసం ఎగబడుతున్న ఇన్వెస్టర్లు.. బెంగళూరు, చెన్నై వద్దనుకుని మరీ.. గత ప్రభుత్వాల హయాంలో చేపట్టిన పట్టణ గృహ నిర్మాణ ప్రాజెక్టులలో ఎదురైన ఆచరణాత్మక ఇబ్బందులను అధ్యయనం చేసిన తర్వాతే ప్రస్తుత ప్రభుత్వం ఈ సరికొత్త నమూనాను రూపొందించింది. గతంలో నిర్మించిన అనేక డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు హైదరాబాద్ నగరానికి దాదాపు 30 నుండి 40 కిలోమీటర్ల దూరంలో నిర్మించడం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగర శివార్లలో ఉండటం వల్ల ఉపాధి అవకాశాలు కోల్పోవడం.. పిల్లల పాఠశాలలు, వైద్య సేవలు, ప్రజా రవాణా వంటి నిత్యావసర వసతులు అందుబాటులో లేకపోవడంతో చాలా కుటుంబాలు ఆ ఇళ్లలోకి వెళ్లడానికి ఆసక్తి చూపలేదు. ఈ చేదు అనుభవాలు పునరావృతం కాకుండా ఉండేందుకు.. ప్రస్తుతం పేద ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకు దగ్గరగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల్లోనే కొత్త ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని నిర్ణయించారు. దీనివల్ల నిరుపేదలకు జీవనోపాధి దెబ్బతినకుండా ఉండటంతో పాటు దీర్ఘకాలిక గృహ భద్రత, యాజమాన్య హక్కులు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం గృహనిర్మాణ శాఖ ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని క్యూర్ ప్రాంతాలలో అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో జరిపే ఉన్నత స్థాయి సంప్రదింపుల అనంతరం ఒకేచోట నిర్మించాల్సిన గృహాల సంఖ్య, భవనాల ఎత్తు, అపార్ట్‌మెంట్ లేఅవుట్లు, తుది డిజైన్లను అధికారులు త్వరలోనే ఖరారు చేయనున్నారు. ఈ పథకంపై ప్రజల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన 1,061 దరఖాస్తులలో ఏకంగా 908 దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించినవే కావడం దీనికి నిదర్శనం. ప్రతి సోమవారం వచ్చే అర్జీలలో దాదాపు 90 శాతం గృహ అవసరాల గురించే ఉంటుండటంతో.. దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక సహాయ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసింది. హైదరాబాద్ మహానగర ప్రాంతంలో సమగ్ర పట్టణ ప్రణాళిక, సుస్థిర అభివృద్ధిని సాధించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పాలనా విధానమే హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ . ఈ విధానం నగర పరిధిలో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన, ట్రాఫిక్ నిర్వహణ, విపత్తు నిర్వహణ, విద్యుత్, తాగునీరు, ప్రజా రవాణా, మున్సిపల్ సేవలను పర్యవేక్షిస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన పనిచేసే అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ లోని సీనియర్ మంత్రులు, ఉన్నతాధికారులు నగర పురోభివృద్ధికి సంబంధించిన ఈ గృహ నిర్మాణ పథకం వంటి ప్రతిష్టాత్మక నిర్ణయాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తుంటారని అధికారులు తెలిపారు.

# దూసుకెళ్తున్న చమురు ధరలు

**మళ్లీ కొంపలు ముంచబోతున్న హార్ముజ్ జలసంధి వార్**



పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య సాయుధ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఈ వార్ దెబ్బకు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. ఇరాన్‌పై అమెరికా నావికాదళ దిగ్బంధనాన్ని పునరుద్ధరించడం.. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య దాడులు ప్రతిదాడులు హెచ్చరిచడంతో ఇంధన సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి గుండా వెళ్లే చమురు ట్యాంకర్ల భద్రతపై ఆందోళనలు రేకెత్తడంతో బుధవారం ట్రేడింగ్‌లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 85 డాలర్ల మార్కును దాటి దూసుకెళ్లాయి.అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్, యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ రెండూ వరుసగా రెండో సెషన్‌లోనూ తమ లాభాల జోరును కొనసాగించాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ బ్యారెల్‌కు 1.01 డాలర్లు (1.19%) పెరిగి 85.74 డాలర్ల వద్ద ముగియగా.క్రూడ్ బ్యారెల్‌కు 0.75 డాలర్లు (0.95%) వృద్ధి చెంది 80.09 డాలర్ల వద్దకు చేరుకుంది. అంతకుముందు సెషన్‌లోనే బ్రెంట్ క్రూడ్ ఏకంగా 9.6 శాతం పెరిగింది, ఇది మే 2020 తర్వాత ఒకే రోజులో నమోదైన అత్యధిక ఒకేరోజు పతనంతో కూడిన పెరుగుదల కావడం గమనార్హం. గత నెల జూన్ 17న ఉభయ దేశాల మధ్య ఘర్షణలను ముగించేందుకు కుదిరిన అవగాహన ఒప్పందం తర్వాత చమురు ధరలు ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి అని రాయిటర్స్ నివేదిక స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై కొత్త సైనిక చర్యలతో పాటు హార్ముజ్ జలసంధిలో ఇరాన్ నౌకాయానాన్ని పూర్తిగా అడ్డుకోవాలని తీసుకున్న నిర్ణయం మార్కెట్లను మరింత వేడెక్కించింది. తాము ఇరాన్‌ను చాలా గట్టిగా దెబ్బతీస్తున్నామని.. వారి దాడి సామర్థ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ జలసంధిని తమ నియంత్రణలోకి తెచ్చుకుంటున్నామని ఓవల్ ఆఫీసులో ట్రంప్ విలేకరులతో వ్యాఖ్యానించారు. దీనితో పాటుగా జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకలకు రక్షణ కల్పించినందుకు గాను ఇతర దేశాల నుండి అమెరికా రుసుము వసూలు చేస్తుందని ఆయన ప్రకటించారు. అంతర్జాతీయ జలమార్గాల్లో అనియంత్రిత నౌకాయానానికి మద్దతు ఇచ్చే అమెరికా సుదీర్ఘకాల విదేశాంగ విధానం నుండి ఇది పూర్తిగా వైదొలగడాన్ని సూచిస్తోంది. ాశ్రీంశీ =ఘుఃఉ హార్ముజ్ జలసంధిలో చమురు ట్యాంకర్లపై ఇరాన్ క్షిపణి దాడి.. భారత నావికుడు మృతి, మరో 8 మందికి గాయాలు అమెరికా చర్యలకు ప్రతికారంగా ఇరాన్ కూడా గల్ఫ్ అంతటా క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. ఒమన్ ప్రాదేశిక జలాల పరిధిలోని హార్ముజ్ జలసంధి దక్షిణ మార్గం గుండా ప్రయాణిస్తున్న రెండు యూఏఈ చమురు ట్యాంకర్లపై ఇరాన్ క్రూయిజ్ క్షిపణులతో విరుచుకుపడిందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రక్షణ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. ఈ దారుణ దాడిలో ఓ భారతీయ సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు.మరోవైపు ఇరాన్ సైనిక స్థావరాలే లక్ష్యంగా అమెరికా దళాలు వరుసగా మూడవ రాత్రి కూడా దాడులు కొనసాగించాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) వెల్లడించింది. ఈ దాడుల వల్ల ఇరాన్ బలగాలకు భారీ నష్టం వాటిల్లడమే కాకుండా.. పౌరులపై, వాణిజ్య నౌకలపై దాడులు చేసే వారి సామర్థ్యం దెబ్బతింటుందని అమెరికా సైన్యం పేర్కొంది. ఇరాన్‌లోని వ్యూహాత్మక ప్రాంతాలైన బందర్ అబ్బాస్‌లో ఏడు పేలుళ్లు.. కిష్ ద్వీపంలో మరో రెండు పేలుళ్లు సంభవించినట్లు పాక్షిక అధికారిక వార్తా సంస్థ ఐజ నివేదించింది. హార్ముజ్ జలసంధిపై ఇరు దేశాలు నియంత్రణ ప్రకటించుకున్న సోమవారం నాటి పరిణామాలతో బ్రెంట్ క్రూడ్ 5 శాతం పైగా పెరిగిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ధరలు పెరుగుతున్నప్పటికీ.. గతంలో యుద్ధ సమయంలో నమోదైన గరిష్ట స్థాయి అయిన బ్యారెల్‌కు 120 డాలర్ల కంటే తక్కువగానే ఉన్నప్పటికీ.. ఈ సైనిక ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే ప్రపంచ ఇంధన మార్కెట్లలో తీవ్రమైన ఒడిదుడుకులు, అస్థిరత తప్పవని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# బంగారం ఇప్పుడే కొనేయండి లేకుంటే ధర మరింత పెరుగుతుందట..!



బంగారం ధర గత రెండేళ్లుగా పెరుగుతూనే ఉంది. ఓ సమయంలో బంగారం ధర గరిష్ఠ స్థాయికి చేరుకుని కాస్త శాంతించింది. ప్రస్తుతం బంగారం ధర కూడా భారీగానే ఉంది. జూలై 15న 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ 770 పెరిగి రూ.1,43,570 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.700 పెరిగి రూ.1,31,600 కు చేరింది. ధర పెరుగుతున్నప్పటికీ బంగారానికి ఉన్న డిమాండ్ తగ్గడం లేదని చెబుతున్నారు. దేశం బంగారాన్ని ఎక్కువగా దిగుమతి చేసుకోవడంతో విదేశీ మారకం కూడా తగ్గుతుంది. అందుకే పసిడి కొనుగోలు తగ్గించాలని కేంద్రం సూచిస్తోంది.అయినప్పటికీ పసిడికి డిమాండ్ తగ్గలేదు. బంగారానికి పెరుగుతున్న డిమాండ్, పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్టుబడిదారులు పసిడి పెట్టుబడి పెట్టడానికి మొగ్గు చూపడంతో బంగారం ధర ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. బంగారానికి తాజాగా ఎస్బీఐ రీసెర్చ్ ఒక నివేదిక విడుదల చేసింది. భారతదేశంలో బంగారం ఖరీదవుతోందని పేర్కొంది. కానీ దిగుమతి విలువలో ఈ పెరుగుదలకు బలమైన వినియోగదారుల డిమాండ్ కారణం కాదని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక తెలిపింది. ప్రపంచ పరిణామాలే ధరల కదలికల్లో పెద్ద పాత్ర పోషిస్తున్నాయని తెలిపింది. బంగారం దిగుమతి పరిమాణం, విలువ పరంగా విభిన్నంగా ఉందని ఎస్‌బిఐ రీసెర్చ్ పేర్కొంది. దిగుమతి పరిమాణాలు తక్కువగా ఉన్నప్పటికీ దిగుమతి బిల్లు వేగంగా పెరుగుతోందని తెలిపింది. బంగారం దిగుమతి కోసం 2025 ఆర్థిక సంవత్సరంలో 57.9 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తే అది ఈ సంవత్సరం 72. 4 బిలియన్ డాలర్లకు పెరిగింది. కరెంట్ అకౌంట్ లోటు పై బంగారం ప్రభావం ఆందోళన కలిగించే విషయమని గుర్తు చేసింది. పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా ప్రభుత్వం బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 15 శాతానికి పెంచింది. 2022 ఫిబ్రవరిలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రూపాయి విలువ పడిపోయింది. అప్పుడు క్యాపిటల్ అకౌంట్ డెఫిసిట్ ను నియంత్రించేందుకు భారత్ బంగారం దిగుమతి పన్నును 15 శాతానికి పెంచింది. ఈ నేపథ్యంలో బంగారం ధర పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

## ఎస్‌బిఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓకు భారీ డిమాండ్ కనిపిస్తోంది

**ఐపీఓ రెండో రోజు అంటే బుధవారం పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది**

ఆఫర్‌లో ఉన్న 124.56 మిలియన్ షేర్లకు గాను ఉదయం 10:48 గంటల (ఐఎస్) సమయానికి 126.74 మిలియన్ షేర్లకు బిడ్లు అందినట్లు ఎక్స్ఛేంజ్ డేటాను బట్టి తెలుస్తోంది. ఈ ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్ ద్వారా రూ.9,795 కోట్లను సేకరించనున్నారు. కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరు ధరను రూ.545-574 గా నిర్ణయించారు. ఒక లాట్ లో 26 షేర్లు వస్తాయి. పెట్టుబడి పెట్టాలనుకునేవారు కనీసం ఒక లాట్ కు బిడ్ వేయాల్సి ఉంటుంది. పబ్లిక్ ఇష్యూకు ముందు ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 2,663 కోట్లను సమీకరించింది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి మంచి డిమాండ్ వచ్చింది. అంతర్జాతీయ, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన వచ్చింది.యాంకర్ ఇన్వెస్టర్లకు ఒక్కో షేరుకు రూ.574 లకు కేటాయించారు. యాంకర్ పెట్టుబడిదారులకు 4,63,93,095 ఈక్విటీ షేర్లను కేటాయించింది. ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లో పెట్టుబడి పెట్టిన యాంకర్ ఇన్వెస్టర్ల జాబితాలో జీఐసీ, అబుదాబి ఇన్వెస్ట్ మెంట్ అథారిటీ, క్యాపిటల్ వరల్డ్ ఇన్వెస్టర్స్, బ్లాక్ రాక్, ఫిడిలిటీ మేనేజ్ మెంట్ అండ్ రీసెర్చ్, గోల్డ్ మన్ సాక్స్ అసెట్ మేనేజ్ మెంట్, నార్జెస్ బ్యాంక్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హెచ్డీఎఫ్సీ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్, నిప్పాన్ ఇండియా మ్యూచువల్ ఫండ్, హెచ్డీఎఫ్సీ లైఫ్ ఇన్సూరెన్స్ ఉన్నాయి. ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓలో అర్హత కలిగిన సంస్థాగత కొనుగోలుదారులకు గరిష్టంగా 50 శాతం, సంస్థాగతేతర పెట్టుబడిదారులకు 15 శాతం, రిటైల్ పెట్టుబడిదారులకు కనీసం 35 శాతం కేటాయించారు. ఉద్యోగులకు కూడా ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.54 శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నారు. ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఓపీఓలో జూలై 17 షేర్ల కేటాయింపు ఉంటుంది. జూలై 20, సోమవారం నాడు రీఫండ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అదే రోజున షేర్లు కేటాయింపుదారుల డీమాట్ ఖాతాల్లో షేర్లు జమ చేస్తారు. జూలై 21 మంగళవారం నాడు ఫండ్స్ మేనేజ్‌మెంట్ షేర్లు లిస్ట్ కానున్నాయి. దేశంలోని అతిపెద్ద రుణదాత అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూరప్‌లోని అతిపెద్ద ఆస్తి నిర్వాహక సంస్థ అయిన అముండిల సంయుక్త సంస్థ ఎస్‌బిఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్, మార్చి 2026 చివరి నాటికి ?12.5 ట్రిలియన్ల (వి131.1 బిలియన్లు) విలువైన ఆస్తులను నిర్వహిస్తోంది. సంస్థాగత-యేతర పెట్టుబడిదారులు ఆఫర్‌లో ఉన్న షేర్ల సంఖ్యకు 2.23 రెట్లు అధికంగా 51.79 మిలియన్ల షేర్ల కోసం బిడ్ దాఖలు చేయగా, రిటైల్ పెట్టుబడిదారులు తమ కోసం కేటాయించిన షేర్లలో 87% అయిన 47.18 మిలియన్ల షేర్ల కోసం బిడ్ దాఖలు చేశారు. ఎస్‌బిఐ వాటాదారుల కోసం రిజర్వ్ చేసిన షేర్ల వాటా 1.6 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. దేశంలోని రద్దీగా ఉండే అసెట్ మేనేజ్‌మెంట్ రంగంలో, ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ తన పోటీ సంస్థలైన ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్, హెచ్డీఎఫ్సీ అసెట్ మేనేజ్‌మెంట్, నిప్పాన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్ నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది. ఎస్బీఐ ఫండ్స్ షేర్లు గ్రే మార్కెట్ లో ప్రీమియంలో ట్రేడవుతున్నాయి. ఒక్కో షేరు రూ.94 లో ప్రీమియంలో ట్రేడ్ అవుతన్నాయి.

## జూన్ లో మ్యూచువల్ ఫండ్లు కొనుగోలు చేసిన స్టాక్స్ ఇవే..!




ఇదే సమయంలో ఇన్ఫోసిస్ లో రూ.1,494 కోట్ల విలువైన షేర్లను విక్రయించింది, బజాజ్ ఆటోలో రూ.674 కోట్లు, టాటా స్టీల్ రూ.584 కోట్లు, జిందాల్ స్టీల్ రూ.419 కోట్లు, హిండాల్కో రూ.331 కోట్ల షేర్లను విక్రయించింది. రిషబ్ ఇన్‌స్ట్రుమెంట్స్, వేదాంత ఆయిల్ గ్యాస్, వేదాంత ఐరన్ స్టీల్, జస్ట్ డయల్‌తో సహా 16 స్టాక్‌ల నుంచి ఈ ఫండ్ నిధులను పూర్తిగా ఉపసంహరించుకుంది. కోటక్ మ్యూచువల్ ఫండ్ జూన్‌లో బజాజ్ ఫైనాన్స్ లో రూ.1,085 కోట్లతో వాటాను పెంచుంకుంది. అజంతా ఫార్మాలో రూ.822 కోట్లు, మారుతి సుజుకి ఇండియాలో రూ.696 కోట్లు, ఎంకూర్ ఫార్మాస్యూటికల్స్ రూ.663 కోట్లు, లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ లో 618 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఇది బీఎస్ఈ లిమిటెడ్ , టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, జీఈ వెర్నోవా టీడీ ఇండియా , ఎన్‌టీపీసీ, ఇండస్ టవర్స్ లలో తన వాటాలను తగ్గించుకుంది. ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ జూన్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌పై తన పెట్టుబడులను రెట్టింపు చేసింది. తన వాటాను పెంచుకుంది. ఇది వేదాంత అల్యూమినియం మెటల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ , టాటా స్టీల్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో వాటాను కొనగోలు చేసింది. లార్సెన్ ఌ టూబ్రో, బజాజ్ ఆటో , వేదాంత ఆయిల్ గ్యాస్, వేదాంత ఐరన్ ఌ స్టీల్, ఐటిసి వాటాను తగ్గించుకుంది. కొత్తగా కొనుగోలు చేసిన వాటిలో పాండీ ఆక్సైడ్స్ ఌ కెమికల్స్, ఇండిక్యూబ్ స్పేసెస్, టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్, సిఎమ్ఆర్ గ్రీన్ టెక్నాలజీస్ వంటివి ఉన్నాయి. యాక్సిస్ ఎంఎఫ్ హెచ్‌డిఎఫ్‌సి లో వాటాను పెంచుంకుంది. ఇందులో రూ.1,076 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసింది. అలాగే బజాజ్ ఫైనాన్స్ , ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎటర్నల్ , చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ ఌ ఫైనాన్స్ లో తన వాటాను పెంచుకుంది. ఇది టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా , హిండాల్కో , ఇన్ఫోసిస్ , రిలయన్స్ ఇండస్ట్రీస్ (540 కోట్లు)లలో తన వాటాలను తగ్గించుకుంది. పి.ఎన్. గాడ్గిల్ జ్యువెలర్స్ ఈ ఫండ్ యొక్క ఏకైక కొత్త కొనుగోలు కాగా, వేదాంత ఆయిల్ ఌ గ్యాస్, వేదాంత పవర్, వేదాంత ఐరన్ ఌ స్టీల్, ఎలక్ట్రానిక్స్ మార్ట్ ఇండియా, మరియు ఆస్ట్రాజెనెకా ఫార్మా ఇండియాల నుంచి పూర్తిగా వైదొలిగింది. నిప్పన్ ఇండియా ఎంఎఫ్ జూన్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో అత్యధికంగా పెట్టుబడులు పెట్టింది. ఇందులో తన వాటాను పెంచుకుంది. ఇది ఐసిఐసిఐ బ్యాంక్ , యాక్సిస్ బ్యాంక్ , బజాజ్ ఫైనాన్స్ , ఏసిఎంఈ సోలార్ హోల్డింగ్స్ లలో వాటా పెంచుకుంది. జీఈ వెర్నోవా టీడీ ఇండియా, టాటా స్టీల్ , వరుణ్ బెవరేజెస్ , పవర్ ఫైనాన్స్ కార్ప్ , హిటాచీ ఎనర్జీ ఇండియాలో తన వాటాలను తగ్గించుకుంది. సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్, వినాటి ఆర్గానిక్స్‌ను కొత్తగా కొనుగోలు చేయగా, భారత్ కోకింగ్ కోల్, పి.ఎన్. గాడ్గిల్ జ్యువెలర్స్ నుంచి ఈ ఫండ్ పూర్తిగా నిష్క్రమించింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# యుద్ధ ప్రభావం.. డీజిల్, విమాన ఇంధన ఎగుమతులపై సుంకం పెంచిన కేంద్రం

**డీజిల్‌పై విండ్‌ఫాల్ ట్యాక్స్ రూ.15.50కు పెంపు**

**రూ.14.50కు పెరిగిన ఏటీఎఫ్‌పై ఎగుమతి సుంకం**

**పెట్రోల్‌పై ఎగుమతి సుంకం రూ.2.50కు తగ్గింపు**

**కొత్త పన్ను రేట్లు నేటి నుంచే అమల్లోకి**

**ముడి చమురు ధరల పెరుగుదలతో కేంద్రం నిర్ణయం**

**రిఫైనింగ్ మార్జిన్ల మార్పులను బట్టి పన్ను సవరణ**



ప్రపంచ చమురు మార్కెట్‌లో పెరుగుతున్న ఒడిదుడుకుల ప్రభావం భారత్‌పైనా కనిపిస్తోంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడంతో కేంద్రం మరోసారి విండ్‌ఫాల్ ట్యాక్స్‌లో మార్పులు చేసింది. డీజిల్, విమాన ఇంధన ఎగుమతులపై పన్ను పెంచుతూ కొత్త రేట్లను అమల్లోకి తీసుకొచ్చింది.కేంద్ర ప్రభుత్వం డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ (ఏటీఎఫ్) ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను పెంచింది. డీజిల్‌పై లీటరుకు రూ.8.50గా ఉన్న ఎగుమతి సుంకాన్ని రూ.15.50కు సవరించింది. లీటరు ఏటీఎఫ్‌పై రూ.7.50గా ఉన్న పన్నును రూ.14.50కు పెంచింది. మరోవైపు పెట్రోల్ ఎగుమతులపై లీటరుకు రూ.4గా ఉన్న సుంకాన్ని రూ.2.50కు తగ్గించింది.ఆర్థిక శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం కొత్త రేట్లు నేటి నుంచే అమల్లోకి వచ్చాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగబాకాయి. దీనివల్ల రిఫైనింగ్ మార్జిన్లు పెరగడంతో కేంద్రం విండ్‌ఫాల్ ట్యాక్స్‌లో తాజా మార్పులు చేసింది.దేశీయంగా ఉత్పత్తి అయ్యే ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను కేంద్రం నిర్దిష్ట వ్యవధుల్లో సమీక్షిస్తుంది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు, రిఫైనింగ్ మార్జిన్లలో వచ్చే మార్పులను బట్టి పన్ను రేట్లను సవరిస్తూ ఉంటుంది.



## ఎన్టీఆర్ అభిమానుల్లో చీలిక.. 'రా ఎన్టీఆర్' వివాదంతో సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్!

తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ హీరోల అభిమానులు తమ అభిమానాన్ని వివిధ రూపాల్లో చాటుకుంటుంటారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం, అభిమాన సంఘాలు ఏర్పాటు చేయడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం సాధారణమే. అయితే తాజాగా యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ పేరుతో ఏర్పడినట్లు ప్రచారం జరుగుతున్న 'రా ఎన్టీఆర్' సంస్థ వివాదం.. అభిమానుల మధ్యే విభేదాలకు దారితీసి సోషల్ మీడియాలో పెద్ద చర్చకు కారణమైంది. గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో 'రా ఎన్టీఆర్' పేరుతో ఒక సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, తిరుపతిలో భారీ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ హాజరవుతారని, వంద కోట్ల రూపాయలతో సేవా కార్యక్రమాలు చేపడతామని, అందుకోసం విరాళాలు కూడా సేకరిస్తున్నట్లు పలు పోస్టులు వైరల్ అయ్యాయి. దీంతో ఈ కార్యక్రమం ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశానికి సంబంధించినదా అనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. ఈ ప్రచారం నేపథ్యంలో ఎన్టీఆర్ అధికారిక బృందం స్పష్టత ఇచ్చింది. విడుదల చేసిన ప్రకటనలో 'రా ఎన్టీఆర్' సంస్థకు తమతో ఎలాంటి సంబంధం లేదని, ఎన్టీఆర్ పేరు లేదా ఆయన ఫోటోలను అనుమతి లేకుండా ఉపయోగించవద్దని పేర్కొంది. అలాగే ఆ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రచారాలు లేదా ప్రకటనలకు ఎన్టీఆర్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. దీంతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి అధికారికంగా తెరపడింది. ఎన్టీఆర్ టీమ్ ప్రకటన తర్వాత అభిమానుల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఒక వర్గం అభిమానులు 'రా ఎన్టీఆర్' పేరుతో ఎన్టీఆర్ ఇమేజ్‌ను దెబ్బతీయొద్దని, ఆయన పేరుతో విరాళాలు సేకరించడం సరికాదని విమర్శిస్తున్నారు. మరోవైపు 'రా ఎన్టీఆర్' సంస్థ ప్రతినిధులు మాత్రం తాము గత ఏడేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తమ ఉద్దేశం కేవలం సేవ మాత్రమేనని చెబుతున్నారు. ఎన్టీఆర్‌పై తమకు అపారమైన గౌరవం ఉందని, ఆయన స్వయంగా ఆపమంటే వెంటనే అన్ని కార్యక్రమాలు నిలిపివేస్తామని కూడా వారు పేర్కొంటున్నారు. అయితే ఎన్టీఆర్ వ్యక్తిగత పీఆర్ టీమ్ అధికారికంగా ప్రకటన విడుదల చేసిన తర్వాత కూడా, "ఆ విషయాలు ఎన్టీఆర్‌కు తెలిసి ఉండకపోవచ్చు" అని 'రా ఎన్టీఆర్' సంస్థ స్పందించడం మరిన్ని సందేహాలకు తావిచ్చింది. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ వ్యవహారం సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్‌గా మారింది. ఒక వర్గం ఎన్టీఆర్ పేరును అనధికారికంగా వినియోగించడం సరికాదని వాదిస్తుండగా, మరో వర్గం సేవా కార్యక్రమాల ఉద్దేశాన్ని సమర్థిస్తోంది.



## 'ప్రభాస్ నుంచి దొంగిలించాల్సింది అదొక్కటే'

సినీ ప్రియుల గుండెల్లో బుట్టబొమ్మగా ముద్ర వేసుకున్న బ్యూటీ పూజా హేగ్డే. తెలుగులో స్టార్ హీరోల సరసన నటించింది. పలు సూపర్ హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ నటించిన జన నాయగన్ రిలీజ్‌కు సిద్ధమైంది. ఈనెల 23 నుంచే థియేటర్లలోకి రానుంది. విజయ్ హీరోగా వస్తోన్న చివరి చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సంగతి పక్కనపెడితే బుట్టబొమ్మ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. రెబల్ స్టార్ ప్రభాస్ గురించి మాట్లాడింది. ఆయనతో రాధే శ్యామ్ మూవీలో హీరోయిన్‌గా చేశానని తెలిపింది. ఈ మూవీ షూటింగ్ టైమ్‌లో నాకు ప్రభాస్ పంపిన ఫుడ్ ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఆనందం వ్యక్తం చేసింది. ఆయన దగ్గర నుంచి తీసుకోవడానికి ఇంకేం లేదని.. అవకాశం వస్తే ఆయన కుక్‌ను దొంగిలిస్తానని ఫన్నీ కామెంట్స్ చేసింది బుట్టబొమ్మ. ఈ కామెంట్స్ నెట్టింట తెగ వైరలవుతున్నాయి.



## అఫిషియల్.. 'జననాయగన్' విడుదల తేదీ ఖరారు!



కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటిస్తున్న ఆఖరి చిత్రం విడుదల తేదీ ఎట్టకేలకు అధికారికంగా ఖరారైంది. ఎన్నో వాయిదాలు, సెన్సార్ వివాదాల తర్వాత ఈ చిత్రానికి 'జననాయగన్' (తెలుగులో 'జననాయకుడు', హిందీలో 'జన్ నేత') అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ ఈ నెల 23న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ ఖఎచీ ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. విజయ్ రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించి, సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న చివరి సినిమా కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. హెచ్. వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, మమితా బైజు, ప్రకాష్ రాజ్, ప్రియమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ (జదీఖీజ) ఇప్పటికే 'ూ' సర్టిఫికేట్ జారీ చేసింది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో జులై 23న విడుదల కాబోతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.



## 'పల్లీ చట్నీ' అనుకుంటే పప్పులో కాలేసినట్లే.. ఓటీటీలోకి వచ్చేస్తోన్న క్రేజీ యాక్షన్ డ్రామా 'పళ్లిచట్టంబి'!

'పళ్లిచట్టంబి'.. ఈ పేరు వినగానే తెలుగు ఆడియన్స్‌కు ముందుగా స్ట్రైక్ అయింది 'పల్లీ చట్నీ'. అవును, ఈ సినిమా టైటిల్ అనౌన్స్ చేసినప్పుడు తెలుగువాళ్లంతా ఇలాగే అవాక్కయ్యారు. ఏంటి.. తెలుగులో పెట్టడానికి నిర్మాతలకు ఇంతకంటే మంచి పేరు దొరకలేదా? అంటూ సోషల్ మీడియాలో మీమ్స్‌తో ఆటాడుకున్నారు. కానీ, కట్ చేస్తే.. కంటెంట్ ఉన్న సినిమాకి టైటిల్స్ అడ్డుకావని ఈ చిత్రం నిరూపించింది. కేరళ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పవర్‌ఫుల్ పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీ, బాక్సాఫీస్ వద్ద మోస్తరు విజయాన్ని అందుకొని విమర్శకుల ప్రశంసలు సైతం సొంతం చేసుకుంది. ఇక థియేటర్లలో ఈ టైటిల్ వెరైటీని చూసి మిస్ అయిన వారి కోసం ఈ చిత్రం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'సోనీ లివ్' లో జులై 24 నుండి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి అందుబాటులోకి రాబోతోంది. సినిమా కథ విషయానికి వస్తే.. 1957 నాటి కేరళ భూసంస్కరణల బిల్లు నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది. చర్చి భూములను కాపాడటం కోసం 'పోతన్ క్రిస్టోఫర్' (టొవినో థామస్) అనే యువకుడిని చర్చి రక్షకుడిగా (చట్టంబి) నియమిస్తారు. అయితే, అతని అసలు పేరు కృష్ణ పిళ్లై. ఒక హిందూ యువకుడైన కృష్ణ పిళ్లై, మారుపేరుతో చర్చిలోకి ఎందుకు అడుగుపెట్టాడు? కమ్యూనిస్ట్ భావజాలం ఉన్న రెబెక్కా (కయాదు లోహర్)తో అతని ప్రేమాయణం ఎలా సాగింది? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాను దర్శకుడు డిజో జోస్ ఆంటోని తెరకెక్కించారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com